ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com

శనివారం 5 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 సంచిక: 80 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## కేబినెట్‌లోకి రాములమ్మ!

**మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు**

**సుముఖంగా ఉన్న కాంగ్రెస్ అధిష్టానం!** 2



తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సింగిడి)**




2

## డ్రగ్స్ పరీక్షలో పాజిటివ్

**పైలట్‌పై ఎయిర్ఇండియా వేటు**

**విమానం 300 అడుగుల కిందికి పడ్డ ఘటనలో చర్యలు!**

# ఆ సార్ మనోడే!

## సిగ్గు తీస్తున్న సిఫార్సు లేఖలు | పోలీసులపై రాజకీయ పెత్తనం

**పరువూ ప్రతిష్ఠ కోసం ఆరాటం.... స్వామి భక్తి ప్రదర్శన లో ఆఫీసర్స్.... బస్తీ నాయకులకు సైతం లోకువ**

### ఖద్దరు క్రీ(నీ)డలో ఖాకీలు - 2

**ఖాకీ అంటే క్రమశిక్షణకు ప్రతీక. చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతను భుజాన వేసుకున్న వ్యవస్థ. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన సంస్థ. కానీ రాజకీయ పలుకుబడి ముందు ఖాకీ బలహీనపడితే..? చట్టం ముందు అందరూ సమానులనే భావనకు గండి పడితే..?**

**(మోహన్ పూసాల)**



ప్రజా ప్రతినిధులతో పోలీసు అధికారులు సమన్వయంగా పనిచేయడం తప్పు కాదు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయ నాయకుల సహకారం తీసుకోవడమూ సహజమే. కానీ సమన్వయం కాస్తా సిఫార్సుగా.. సిఫార్సు కాస్తా ఒత్తిడిగా.. ఒత్తిడి కాస్తా పోలీసు నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరితేనే అసలు సమస్య మొదలవుతుంది.

**మనోడే.. అంటే చాలు!**

కొంతమంది పోలీసు అధికారుల వద్దకు ఏదైనా ఫిర్యాదు తీసుకెళ్తే ముందుగా వినిపించే మాటలు ఇవేనంటూ ప్రజల్లో చర్చ జరుగుతోంది.

"ఆయన మనోడే.."

"ఆయనకు పెద్దలతో పరిచయం ఉంది.."

"పై నుంచి ఫోన్ వచ్చింది.."

చట్టపరమైన అంశాల కంటే ఎవరి పలుకుబడి ఎంత? ఎవరి వెనుక ఎవరు ఉన్నారు? అన్నదే నిర్ణయాలకు కొలమానంగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఒక సామాన్యుడు పోలీస్ స్టేషన్ గడప తొక్కితే నిబంధనలు గుర్తొస్తాయి. అదే ఓ రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తి వస్తే అదే నిబంధనలకు వేరే అర్థాలు వస్తున్నాయన్న ఆరోపణలు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి.

**పోలీసులపై రాజకీయ పెత్తనం**

రాజకీయ నాయకులకు ప్రజల్లో ప్రభావం ఉంటుంది. అది ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ఆ ప్రభావం పోలీసు వ్యవస్థ పనితీరును శాసించే స్థాయికి చేరకూడదు.ఎవరిపై కేసు నమోదు చేయాలి..,ఎవరిని పిలిచి విచారించాలి..,ఎవరిపై చర్యలు తీసుకోవాలి..,ఎవరిని వదిలేయాలి...ఇలాంటి అంశాల్లో రాజకీయ జోక్యం పెరిగితే చట్టం తన పని తాను చేసుకునే పరిస్థితి ఎక్కడుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పరువూ ప్రతిష్ఠ**

ఇక్కడ మరో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు తమ పరువు ప్రతిష్ట కోసం తమకు దగ్గరుండే ఆఫీసర్లకు పోస్టింగులు ఇప్పిస్తుండగా.., కొంతమంది ఆఫీసర్లు సదరు రాజకీయ నాయకులకు అనుకూలంగా ఉండడం కోసమే పోస్టింగులు అడుగుతున్నారన్న అభిప్రాయం కూడా ఉంది. మరికొంత మంది ఆఫీసర్లు  ప్రజలకు జవాబుదారీగా ఉండటంకంటే తమను తాము రాజకీయంగా ఓ వర్గానికి దగ్గరగా చూపించుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.'మనోడే' అనే ముద్ర భవిష్యత్తులో ఉపయోగపడుతుందన్న ఆలోచనతో కొందరు అధికారులు రాజకీయ నేతల చుట్టూ తిరుగుతున్నారనే చర్చ కూడా లేకపోలేదు.ఇదిలా ఉండగా.., ఖాకీ గౌరవం ఖద్దరు నీడలో ఎందుకు ఉండాలని ప్రశ్న నిజాయితీగల ఆఫీసర్లలో కనబడుతున్నది.

**స్వామి భక్తిలో ఆఫీసర్లు**

రాజకీయ పెద్దల మెప్పు కోసం కొందరు అధికారులు ప్రదర్శించే అత్యుత్సాహం పోలీసు శాఖలోనే చర్చకు దారితీస్తోంది.అధికారిక కార్యక్రమాలు, వ్యక్తిగత కార్యక్రమాలు, రాజకీయ కార్యక్రమాలు.. సందర్భం ఏదైనా సరే తమకు అనుకూలమైన రాజకీయ నాయకుడి మెప్పు పొందేందుకు కొందరు అధికారులు చూపుతున్న అత్యుత్సాహం స్వామి భక్తికి నిదర్శనంగా నిలుస్తోంది.వారు మాత్రం పదవీ భద్రత కోసం ముందస్తు గౌరవం అని మిన్న కుండి పోతున్నారట.నిజానికి అధికారి ఎవరికీ భక్తుడిగా ఉండాల్సిన అవసరం లేదు.
చట్టానికి మాత్రమే విధేయుడిగా ఉండాలి.

**బస్తీ నాయకులకు సైతం లోకువ**

రాజకీయ పలుకుబడి ఉన్న ప్రతి ఒక్కరికీ అధికార వ్యవస్థ తలవంచాల్సిన పరిస్థితి వస్తే.. అది కేవలం పోలీసుల ప్రతిష్ఠకే కాదు, మొత్తం పరిపాలనా వ్యవస్థకే ప్రమాదకరం. స్థానిక స్థాయిలో ప్రభావం ఉన్న కొందరు నాయకులు పోలీసు అధికారులపై నేరుగా ఒత్తిడి తెచ్చే స్థాయికి చేరుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నచిన్న విషయాల్లోనూ పోలీసులపై ఆదేశాలు జారీ చేసే ధోరణి పెరుగుతోందని పలువురు అంటున్నారు. బస్తీ నాయకుడైనా,పదవి చిన్నదైనా.. రాజకీయ అండ ఉంటే చాలు.. పోలీస్ స్టేషన్లో చెలాయించవచ్చుననే భావన బలపడితే, వ్యవస్థలో అధికారిక హోదాల విలువ ఏముంటుందని సీనియర్, రిటైర్డ్ ఆఫీసర్లు అంటున్నారు.

**సిగ్గు తీస్తున్న సిఫార్సు లేఖలు**

ఇక సిఫార్సు లేఖల సంస్కృతి మరో చర్చనీయాంశం. చట్టపరమైన ప్రక్రియలో అధికారుల నిర్ణయాలు ఆధారాలు, నిబంధనలు, వాస్తవాలపై ఉండాలి. కానీ కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకుల సిఫార్సు లేఖలు పోలీసు కార్యాలయాలకు చేరడం.. వాటిపై చర్యలు తీసుకోవాలని ఒత్తిళ్లు రావడం.. పోలీసు అధికారుల స్వతంత్రతపై అనుమానాలకు తావిస్తోంది.సిఫార్సు లేఖ ప్రజాప్రతినిధి అభిప్రాయానికి ప్రతీక కావచ్చు. కానీ అది చట్టానికి ప్రత్యామ్నాయం కాకూడదు.ఒక లేఖ చూసి కేసు పెట్టడం, మరో లేఖ చూసి కేసు ఆపడం జరిగితే.. సామాన్యుడికి న్యాయం ఎక్కడ దొరుకుతుందని మేధావులు ప్రశ్నిస్తున్నారు.

**ఖాకీకి రాజకీయ రంగు ఎందుకు..?**

పోలీసు అధికారి ఏ ప్రభుత్వంలో పనిచేసినా.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. తన బాధ్యత చట్టాన్ని అమలు చేయడమే. రాజకీయ అధికారం మారినప్పుడల్లా పోలీసుల వైఖరి మారుతుందనే అభిప్రాయం ప్రజల్లో కలగడం అత్యంత ప్రమాదకరం.ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారవచ్చు. రాజకీయ నాయకులు మారవచ్చు.
కానీ చట్టాన్ని అమలు చేసే వ్యవస్థపై ప్రజల నమ్మకం మాత్రం మారకూడదు. ఇదే క్రమంలో సామాన్య ప్రజలు అడుగుతున్న ప్రశ్న ఇదే.

**ఖద్దరు క్రీడలో ఖాకీలు పావులుగా మారాలా..?**

లేక ఖాకీ తన స్వతంత్రతను కాపాడుకుంటూ.. చట్టం ముందు అందరినీ సమానంగా చూడాలా.. జవాబు పోలీసు అధికారుల చేతుల్లోనే ఉంది.
అది వారి నిర్ణయాల్లో కనిపించాలి..
వారి విధుల్లో ప్రతిబింబించాలి..
ప్రజల నమ్మకంలో నిలవాలి.ఎందుకంటే..ఖాకీకి నిజమైన "మనోడు" ఒక్కరే —అది చట్టం.

**పోస్టింగ్ కావాలా నాయనా...**
**రేటెంతో తెలుసా...**

తరువాతి సంచికలో...



## పనుల వేగం పెంచండి

### నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దని ఆదేశం

**కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన**

**మద్దూరులో, హకీంపేట, దౌల్తాబాద్‌లలో అభివృద్ధి పనుల పరిశీలన**

**భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని సూచించిన సీఎం**

కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతో పాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి 2 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశం**

అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సింగిడి)**



## కేసీఆర్ చాలా మంచోడు

### కొండా సురేఖ ప్రశంసలు

**వార్తా ఛానళ్లకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్న కొండా సురేఖ**

**కేసీఆర్ తమను హుందాగా రిసీవ్ చేసుకునేవారని వెల్లడి**

**కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్న సురేఖ** 2

**సురేఖను తెలంగాణ భవన్**

## గేటు కూడా తాకనివ్వం

**బీఆర్ఎస్‌లో చేరికపై మాజీ మంత్రి సంచలన వ్యాఖ్యలు**



2

తాజా పరిణామాలతో తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా రసవత్తరంగా మారింది. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ భవిష్యత్ కార్యాచరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఆమె కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా లేక హస్తానికి హ్యాండ్ ఇచ్చి మరో పార్టీలో చేరుతారా అనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సింగిడి)**

## వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం

**జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు, పొదుపుగా వాడుకోండి**

**తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన**

**విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని విడుదల చేయొద్దు**

**పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల నియంత్రించాలన్న కేఆర్ఎంబీ**

**తాగునీటి అవసరాలను పరిగణలోకి తీసుకోవాలని సూచన** 2




తెలుగురాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సింగిడి)**

## సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు

**కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు ఉపశమనం** 2

**ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం**

**వెరిఫికేషన్ సమయంలో మాత్రం సర్టిఫికెట్లు తప్పనిసరి**

## పాండూ ముఠా బరితెగింపు

### దర్జాగా పేదల బియ్యం స్మగ్లింగ్

**ఇన్ ఫార్మర్ గా భావించి ఒకరి ఇంటిమీదకు**

**దాడికి విఫలయత్నం..భయాందోళనలో బాధితుడు**

**సిద్దిపేటలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత**

**సుమారు 300 క్వింటాళ్లు,ఓ లారీ స్వాధీనం**

**8 మందిగల ముఠా జిల్లా దాటి విధ్వంసం**



తనే సమాచారం ఇచ్చినట్లు భావించి ఒకరి ఇంటి మీదకు వెళ్లి గొడవకు దిగుతున్న చిత్రం




**సిద్దిపేట,సెప్టెంబరు 04(సింగిడి):**

సిద్దిపేటను కేంద్రంగా చేసుకున్న 08 మంది సభ్యులు గల ఓ ముఠా రేషన్ బియ్యం స్మగ్లింగ్ లో బరితెగిస్తోంది. జిల్లాతో పాటు సమీప జిల్లాల్లో ఈ ముఠా సాగిస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదు. జిల్లాలో ప్రముఖంగా గల గజ్వేల్,హుస్నాబాద్ తదితర ప్రాంతాలతోపాటు సమీప జిల్లాలైన కామారెడ్డి,రాజన్న సిరిసిల్ల మొదలగు జిల్లాలకు సైతం పీడీఎస్ రైస్ దందా విస్తరించారు.

**అంతా పాండూ కనసన్నల్లోనేనట !**

ఎనిమిది మందిగల ఈ మాఫియా ముఠాకు పాండూ నేతృత్వం వహిస్తాడట. జిల్లా కేంద్రంలో గల ఓ రైస్ మిలును తీసుకుని దాని ముసుగులో భారీ ఎత్తున పీడీఎస్ దందా నడుపుతారట.మొత్తానికి ఈ ఎనిమిది మంది అత్యంత ఐకమత్యంగా వ్యవహరిస్తూ సివిల్ సప్లైస్ కు చెందిన కోట్ల నిధులని తమ జేబుల్లోకి మల్లించు కుంటున్నారని పెద్ద ఎత్తున ప్రచారముంది.


**పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత...**

కాగా శుక్రవారం వేకువజామున పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని సివిల్ సప్లైస్ స్టేట్ టాస్క్ ఫోర్స్ బృందం పట్టుకుంది.అందులో సుమారు 33 మెట్రిక్ టన్నుల బియ్యం ఉన్నట్లు మీడియాకు వెల్లడించారు.అదేవిధంగా సదరు లారీ దాని డ్రైవర్ ను స్థానిక పోలీసుస్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

**అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం**

## తప్పుడు ప్రచారం: జగన్ 2

## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్



కేసు నమోదు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు



**కొండా సురేఖను తొలగించారు..**

## పొంగులేటి సంగతేంటి?

### హరీశ్ రావు 2

తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సింగిడి)**

**ఓట్ల కోసమే ఒవైసీ సోదరులకు**

## దేశభక్తి సర్టిఫికెట్లు 2

### రాంచందర్ రావు

ఒవైసీ బ్రదర్స్ దేశభక్తులంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసలు కురిపించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సింగిడి)**

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
5 సెప్టెంబర్ 2026



# డ్రగ్స్ పరీక్షలో పాజిటివ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 (సింగిడి)**

ఫుకెట్– ఢిల్లీ విమాన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. డ్రగ్ వినియోగ పరీక్షలో పాజిటివ్‌గా తేలిన పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. ఫుకెట్ నుంచి ఢిల్లీకి వచ్చిన విమానానికి పైలట్ ఇన్ కమాండ్‌గా వ్యవహరించిన పైలట్ సేవల్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా శుక్రవారం తెలిపింది. ఇక్కడ విమాన భద్రత, పైలట్ల ఫిట్‌నెస్, నియంత్రణ పరమైన నిబంధనల విషయంలో తాము జీరో టాలరెన్స్ విధానం పాటిస్తామని ఎయిర్ ఇండియా స్పష్టం చేసింది. పైలట్ నిషేధిత మత్తుపదార్థాలు ఉపయోగించినట్లు సంబంధించిన పరీక్షలో తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

ఎయిర్ ఇండియా ప్రకటనకు కొద్ది గంటల ముందే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) ఫుకెట్– ఢిల్లీ విమాన ఘటనపై ప్రాథమిక నివేదికను (ప్రిలిమినరీ రిపోర్ట్) విడుదల చేసింది. ఈ రిపోర్టులో పైలట్ డ్రగ్ వినియోగం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. ఈ వ్యవహారంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) తగిన చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ సూచించింది. నివేదిక వెలువడిన వెంటనే ఎయిర్ ఇండియా పైలట్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు నిర్ణయం తీసుకుంది.

**ఆగస్ట్ 4న ఘటన- 300 అడుగులు కిందికి పడ్డ విమానం**

ఈ ఘటన ఆగస్ట్ 4న జరిగింది. ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిర్ ఇండియా A320 విమానంలో భయంకర సంఘటన జరిగింది. ప్రయాణ సమయంలో ఒక్కసారిగా ఆకాశంలోనే విమానం దాదాపు 300 అడుగుల ఎత్తును కోల్పోయింది. దీంతో విమానంలోని పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. AAIB ప్రాథమిక నివేదిక ప్రకారం విమానం 36 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు దాదాపు ఒకేసారి పని చేయడం ఆగిపోయాయి. దీంతో విమానంలోని ఆటోపైలట్ డిస్‌కనెక్ట్ అయింది. అదే సమయంలో కొద్దిసేపు స్టాల్ వార్నింగ్ వచ్చింది. అనంతరం విమానం ఎత్తులో అనూహ్యంగా మార్పు చోటుచేసుకుంది. ఈ పరిణామంతో ప్రయాణికులు గాయపడ్డట్లు AAIB రిపోర్ట్ స్పష్టం చేసింది.

ఘటన సమయంలో విమానంలో మొత్తం 145 మంది ఉన్నారు. ఆకస్మికంగా విమానం కుదుపులకు లోనవడంతో సుమారు 24 మంది ప్రయాణికులు గాయపడ్డారు. తర్వాత ఎట్టకేలకు ఉదయం 11.30 గంటల సమయంలో ఆ ఫ్లైట్ ఢిల్లీలో సురక్షితంగానే ల్యాండ్ అయింది. గాయపడ్డ వారిని ఆస్పత్రులకు తరలించారు. అయితే ఈ క్రమంలోనే కో పైలట్, పైలట్ ఇన్ కమాండ్‌కు డ్రగ్ యూసేజ్ టెస్ట్ నిర్వహించగా పైలట్ ఇన్ కమాండ్‌కు పాజిటివ్‌గా వచ్చింది. కో పైలట్ నమూనాలు నెగెటివ్‌గా తేలాయి. ఈ ఘటన తర్వాత ఎయిర్ ఇండియా మరింత అప్రమత్తమైంది. తమ పైలట్లకు కఠినమైన వైద్య పరీక్షలు, ప్రొఫిషియెన్సీ చెకింగ్స్, ఇతర నియంత్రణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. తమ పైలట్లు అందరికీ 100 శాతం వాలంటరీ డ్రగ్ టెస్టింగ్ కూడా ప్రారంభించినట్లు ప్రకటించింది.

**డ్రగ్ వినియోగమే కారణమా- నో క్లారిటీ!**

అయితే ఘటన సమయంలో మరే ప్రతికూల వాతావరణ పరిస్థితులు కనిపించలేదని ఏఏఐబీ రిపోర్టులో వెల్లడించింది. మరోవైపు పైలట్ డ్రగ్ వినియోగానికి, హైడ్రాలిక్ వ్యవస్థల వైఫల్యానికి లేదా విమానం ఎత్తులో మార్పులకు ఒకదానితో మరొకటి సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో ఇప్పటివరకు నిర్ధరించలేదని ఏఏఐబీ స్పష్టం చేసింది. AAIB రిపోర్ట్ ప్రకారం– ఆ విమానం భారత గగనతలంలోకి ప్రవేశించిన తర్వాత 34 వేల అడుగుల ఎత్తు నుంచి 36 వేల అడుగులకు పైకి చేరాలని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC) ఆదేశించింది. దీంతో ఆ ఎత్తులో ప్రయాణిస్తుండగా ఊహించని ఘటన చోటుచేసుకుంది.

మొదట గ్రీన్, తర్వాత బ్లూ, ఎల్లో హైడ్రాలిక్ వ్యవస్థల్లోనూ సమస్యను గుర్తించింది. ప్రమాద సమయంలో కో– పైలట్ విమానాన్ని నడుపుతున్నారు. ఊహించని మార్పులతో వెంటనే పైలట్ ఇన్ కమాండ్ నియంత్రణలోకి తీసుకున్నారు. ఈ సమయంలో విమానం నిర్దేశిత ఎత్తు కంటే సుమారు 372 అడుగులు పైకి వెళ్లి, మళ్లీ 292 అడుగులు కిందికి పడిపోయింది. మళ్లీ కొన్ని సెకన్లలోనే హైడ్రాలిక్ వ్యవస్థలు తిరిగి పనిచేయడంతో ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థలు సాధారణ స్థితికి వచ్చాయి. అయితే ఇది ప్రాథమిక రిపోర్ట్ మాత్రమే. దర్యాప్తు పూర్తి స్థాయిలో చేసిన తర్వాత ఫైనల్ రిపోర్ట్ రానుంది.

## కొండా సురేఖను తొలగించారు..

# పొంగులేటి సంగతి ఏమిటి?

సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.

సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## సురేఖను తెలంగాణ భవన్

# గేటు కూడా తాకనివ్వం

కొండా సురేఖ కాంగ్రెస్ ను వీడి ఇతర పార్టీలో చేరేందుకు ఆయా పార్టీలతో చర్చలు జరుపుతున్నారనే ప్రచారం వేళ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కొండా సురేఖ విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు.

**తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం:**

శుక్రవారం మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన జగదీశ్ రెడ్డి.. కొండా సురేఖను మళ్లీ బీఆర్ఎస్ చేరుతారనే ప్రచారాన్ని ప్రచారాన్ని ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వంమని ఆమెను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వమని స్పష్టం చేశారు. పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వారందరినీ తిరిగి చేర్చుకునే ప్రసక్తి లేదని, పార్టీ మారిన వారిలో కేవలం ఒకరిద్దరిని తప్ప మిగతా ఎవరినీ మళ్లీ బీఆర్ఎస్‌లోకి రానిచ్చేది లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని జగదీశ్ రెడ్డి బాంబు పేల్చారు.

**రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే అమ్ముడుపోయినట్టే:**

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని బీఆర్ఎస్‌లోకి అసలు తీసుకోమన్నారు. ఆయనకు ఒకవేళ రేవంత్ రెడ్డి సర్కార్ మంత్రి పదవి ఇస్తే.. అది పూర్తిగా అమ్ముడుపోయినట్టే లెక్క అని వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు తమ పార్టీ పూర్తి వ్యూహాలతో సిద్ధంగా ఉందని జగదీశ్ రెడ్డి వెల్లడించారు.

# వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం

కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు.

**కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసిన ఏపీ :**

శ్రీశైలం నుంచి తెలంగాణ విద్యుదుత్పత్తిపై కృష్ణా బోర్డుకు ఆంధ్రప్రదేశ్ ఫిర్యాదు చేసింది. విద్యుదుత్పత్తికి వాడటం వల్ల నిల్వలు వేగంగా తగ్గుతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేఆర్ఎంబీ స్పందించి తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శికి కృష్ణా బోర్డు లేఖ రాసింది. విభజన చట్టంలోని నిబంధనలు ప్రస్తావించింది. విద్యుత్ అవసరాలతో పోలిస్తే సాగునీటికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. సాగునీటి అవసరాల కంటే తాగునీటికే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపింది. విభజన చట్టం నిబంధనలను గౌరవించి,




అమలుచేయాలంది. ముఖ్యంగా తాగునీటి అవసరాలు కాపాడాలని తెలంగాణను కోరింది. తాగునీటి అవసరాలు రక్షించాలని ఇప్పటికే పలుసార్లు చెప్పామని లేఖలో పేర్కొంది.

**మరోసారి భిన్నాభిప్రాయాలు :**

కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం–నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

**పాత నిష్పత్తి సరికాదని వాదన :**

ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పాత 66:34 నిష్పత్తిని అమలు చేయడం సరికాదని తెలంగాణ వాదించింది. రాష్ట్ర అవసరాల దృష్ట్యా తెలంగాణకు మొత్తం 200 టీఎంసీల నీరు అవసరమని, అందుకు అనుగుణంగా నీటి కేటాయింపులు చేయాలని కోరినట్లు రమేశ్ బాబు తెలిపారు.

66:34 నిష్పత్తిని గత మూడేళ్లుగా తెలంగాణ అంగీకరించడం లేదు. పోతిరెడ్డిపాడు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ నీటిని తరలిస్తోంది, ప్రస్తుతం వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకుంటోంది. ఈ అంశాలన్నింటినీ సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే కేఆర్ఎంబీ పూర్తి స్థాయి సమావేశంలో సమగ్రంగా చర్చిస్తాం – రమేశ్ బాబు, తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్

**ఆ ప్రతిపాదన సహేతుకంగా లేదు :**

త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం రాలేదని ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి తెలిపారు. 66:34 నిష్పత్తి ప్రకారం తెలంగాణ, ఏపీకి నీటి విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలని తాము కోరినట్లు చెప్పారు. వచ్చే ఆగస్టు వరకు తమ రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం 104 టీఎంసీల నీరు అవసరమని కోరినట్లు వెల్లడించారు.

# పనుల వేగం పెంచండి

దే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ఆరా**

దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**అధికారులకు దిశానిర్దేశం**

430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం: జగన్

ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023–24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018–19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు.

## ఓట్ల కోసమే ఒవైసీ సోదరులకు

# దేశభక్తి సర్టిఫికెట్లు

ఒవైసీ బ్రదర్స్ దేశభక్తులంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసలు కురిపించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. దేశభక్తులు అంటే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అని.. అలాంటి నాయకులతో ఒవైసీలను పోల్చడం విడ్డూరమన్నారు. కేవలం ఓట్ల కోసమే ఓవైసీలను సీఎం పొగుడుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రి వద్ద శుక్రవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. అసలు రేవంత్ రెడ్డి ఏ అర్హతను చూసి ఒవైసీ సోదరులకు దేశభక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. గతంలో 15 నిమిషాలు పోలీసులను పక్కకు జరిపితే ఈ దేశంలో ఎవరి పరిస్థితి ఎలా ఉంటుందో చూపిస్తామంటూ బెదిరింపులకు దిగినందుకా? పబ్లిక్‌లో ఆవు మాంసం తింటాం, గోమాంసం బాగుంటుంది అంటూ మాట్లాడినందుకు మెచ్చుకుని దేశభక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. మోదీకి, అమిత్ షాకు దేశభక్తి ఉందని రేవంత్ రెడ్డి ఒప్పుకున్నందుకు సంతోషమని, కానీ ఒవైసీలకు దేశభక్తి సర్టిఫికెట్లు ఇవ్వడం మాత్రం ఈ దేశంలో ప్రతి ఒక్కరినీ అవమానించడమేనన్నారు.

# కేసీఆర్ చాలా మంచోడు

## కొండా సురేఖ ప్రశంసలు

మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

## కొండా సురేఖకు

# అధికారిక భద్రత ఉపసంహరణ

**హైదరాబాద్, సెప్టెంబర్4 (సింగిడి):**

తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక భద్రతను పూర్తిగా ఉపసంహరించుకుంది. మంత్రివర్గం నుంచి ఆమెను తొలగించిన మరుసటి రోజే ఈ చర్యలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రి హోదాలో ఆమెకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పరిధిలోని ప్రత్యేక గన్‌మన్లను ప్రభుత్వం తక్షణమే వెనక్కి పిలిపించింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే ఆమె భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను రద్దు చేస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. దీనితో ఆమె అధికారిక కాన్వాయ్, ఎస్కార్ట్ భద్రత పూర్తిగా నిలిచిపోయాయి. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



# సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు

**హైదరాబాద్, సెప్టెంబర్4 (సింగిడి):**

కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చింది. దరఖాస్తు సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా.. వాటి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ముందుగా కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ వెల్లడించింది. దీంతో సర్టిఫికెట్లు రావడంలో జాప్యం కారణంగా దరఖాస్తు గడువు మిస్ అవుతుందేమోనని ఆందోళన చెందుతున్న వారికి ఉపశమనం లభించింది.

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దివ్యాంగుల సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాలు, సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు సమయం పడుతుండటంతో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం ఆగకుండా ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత మీసేవా కేంద్రాల్లో కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఓ కీలక నిబంధన ఉంది.

**వెరిఫికేషన్‌లో మాత్రం తప్పనిసరి**

దరఖాస్తు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అధికారులు దరఖాస్తును పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. కాబట్టి దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**సెప్టెంబర్ 15 వరకు అవకాశం**

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అర్హత ఉన్న వారు ఇంకా దరఖాస్తు చేయకపోతే ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు అప్లై చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సింగిడి)**

సాధారణంగా ముఖ్యమంత్రులకు భద్రత చాలా కట్టుదిట్టంగా ఉంటుంది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటించిన సమయంలో బందోబస్తుకు సంబంధించిన అత్యంత రహస్య వివరాలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసిన ఘటనలో కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ భద్రతా వివరాలను పోస్ట్ చేసినందుకుగానూ తెలుగు స్క్రైబ్ ఎక్స ఖాతా నిర్వాహకులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. మొదట ఈ ఫిర్యాదుతో జులై 14న ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర విచారణ కోసం ఈ కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి రీ-రిజిస్టర్ చేశారని సమాచారం. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 13న సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబంధించిన నిమిషాల వారీ పూర్తి షెడ్యూల్, భద్రతా ఏర్పాట్లపై ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐఏ, డీజీపీ వంటి ఉన్నతాధికారులకు ఒక వైర్‌లెస్ సందేశం ద్వారా సమాచారం పంపాం. జెడ్ ప్లస్ (్గం) కేటగిరీ భద్రతకు అనుగుణంగా చేసిన ఈ ఏర్పాట్ల సందేశంలో సీఎం బ్లడ్ గ్రూప్, సీఎస్‌వో ఫోన్ నంబర్ వంటి అత్యంత సున్నితమైన అంశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

# కేబినెట్‌లోకి రాములమ్మ..!

**మంత్రి పదవి కోసం**

**హైకమాండ్‌తో చర్చలు**

**సుముఖంగా ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం!**

**హైదరాబాద్, సెప్టెంబర్4 (సింగిడి):**

తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపికగా మారింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. ఆమె మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు. దీంతో సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తరఫున పలువురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. విజయశాంతికి అవకాశంఇవ్వాలనే ఆలోచన రాష్ట్ర నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతి గుర్తింపు పొందారు. గతంలో బీఆర్ఎస్‌లో ఎంపీగా పనిచేసిన ఆమెకు ఆ పార్టీ రాజకీయాలు, నేతల వ్యవహారశైలిపై మంచి అవగాహన ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే విషయంలో విజయశాంతి వంటి బలమైన వాయిస్ కేబినెట్‌లో ఉంటే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వగల నేతగా ఆమెను పరిగణిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవిపై చర్చల నేపథ్యంలో విజయశాంతి ఢిల్లీకి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హైకమాండ్ పెద్దలను కలిసి తన రాజకీయ భవిష్యత్తు, మంత్రి పదవిపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. పార్టీపై బహిరంగంగా అసంత ప్తి వ్యక్తం చేయకుండా.. అప్పుడప్పుడు రాజకీయ అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. దీంతో ఆమెకు మంత్రివర్గంలో అవకాశం ఇస్తే పార్టీకి మరింత బలమైన స్వరం లభిస్తుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నింటి కంటే ఆసక్తికరంగా.. విజయశాంతి కేబినెట్‌లో చేరితే హోంశాఖ కావాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

మరోవైపు కేబినెట్‌లోకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తీసుకునే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కేబినెట్‌లో రెండు ఖాళీలు ఉండగా.. తాజాగా కొండా సురేఖ బర్తరఫ్‌తో మొత్తం ఇద్దరు లేదా ముగ్గురు కొత్త ముఖాలను మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు సీనియర్ మంత్రుల శాఖలను మార్చే అవకాశాలపై కూడా కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విజయశాంతికి నిజంగానే మంత్రి పదవి దక్కుతుందా.. దక్కితే ఆమె కోరుకుంటున్న హోంశాఖనే కేటాయిస్తారా.. అనే అంశాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రభాతవేళ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
05-9-2026

## ఛీర్యాల ఎన్ జే ఆర్ కాలనీ రోడ్లను మరమ్మతు చేయాలి

### కీసర మండల సిపిఎం కార్యదర్శి బంగారు నర్సింగరావు



**కీసర సెప్టెంబర్ 4 (సింగిడి):** కీసర మండలం, ఛీర్యాల పరిధిలోని ఎన్ జే ఆర్ కాలనీ (సర్కిల్-01) ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిని, పెద్ద పెద్ద గుంతలతో అధ్వాన్నంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ గుంతలన్నీ నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. దీనివల్ల స్థానిక నివాసితులు, వాహనదారులు మరియు కాలినడకన వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ సిపిఎం కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ జే ఆర్ కాలనీ సందర్శించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న గుంతలు కనిపించకపోవడం వల్ల ప్రతిరోజూ ద్విచక్ర వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు ఈ సమస్యపై స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఆటోలు, అత్యవసర వాహనాలు (అంబులెన్స్ వంటివి) కాలనీలోకి రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యాన్ని విడనాడి, ఈ రహదారి దుస్థితిపై వెంటనే స్పందించాలి. గుంతలమయమైన రోడ్డుకు అత్యవసరంగా తాత్కాలిక శాశ్వత మరమ్మత్తులు (బి.టి/సి.సి రోడ్డు) చేపట్టాలి. కాలనీ వాసుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ ప్రమాదాలను నివారించాలి. ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సిపిఎం కీసర మండల కమిటీ ఎన్ జే ఆర్ కాలనీ ప్రజల తరపున డిమాండ్ చేస్తున్నాము అని తెలిపారు.

## వన దుర్గ భవాని ట్రేడర్స్ షాప్‌ను ప్రారంభించిన మంత్రి

### తన్నీరు హరీష్ రావు

### స్థానిక నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి





**కౌల్చారం సెప్టెంబర్ 4 (సింగిడి):** మెదక్ జిల్లా కౌల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో మాజీ జెడ్పిటిసి ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్ ఏడుపాయల టి జంక్షన్ సమీపంలో శ్రీ వనదుర్గ భవాని ట్రేడర్స్ ప్రారంభోత్సవానికి మాజీ బిఆర్ఎస్ మంత్రి హరీష్ రావు, నర్సాపూర్ స్థానిక ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ నాయన నాణ్యమైన వస్తువులను, సరసమైన ధరలకు విక్రయిస్తూ అటు వ్యాపారస్తులకు, ఇటు ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌల్చారం మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్, మాజీ ఎంపీపీ కోరబోయిన మంజుల కాశీనాథ్ , యువత విభాగమ అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బాగా రెడ్డి, కొమ్ముల యాదగౌడ్, కరెంట్ రాజా గౌడ్, చిన్న రాములు, అరికెల నాగయ్య,, అరిగే విజయ్ , దొడ్ల ఆంజనేయులు, ఆరే రవీందర్, కౌల్చారం మండల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు: వడ్డేపల్లి రాజేశ్వరరావు



**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 4 (సింగిడి):** భారతీయ జనతా పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా (అర్బన్) ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా ఫిరోజ్‌గూడకు చెందిన ఎడ్ల అనిల్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎడ్ల అనిల్‌కు వడ్డేపల్లి రాజేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే నిబద్ధత గల కార్యకర్తలకు తగిన సమయంలో సముచిత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎలాంటి పదవులను ఆశించకుండా పార్టీ బలోపేతం కోసం క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎడ్ల అనిల్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి తేజస్విని, బాలానగర్ డివిజన్ బీజేపీ నాయకులు ధన్‌రాజ్, మంజుభావన, సుజాత, దేవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన గ్రామసభలు

**కౌల్చారం సెప్టెంబర్ 4 (సింగిడి):** మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ గారి ఆదేశాల మేరకు కౌల్చారం మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సభలను గ్రామ ప్రజల మధ్య నిర్వహించాలని మండల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు మండలంలోని పోతంశెట్టిపల్లి కొంగోడు నాయిని జలాల్పూర్ పోతిరెడ్డిపల్లి



గ్రామాలలో నర్సాపూర్ ఆర్డిఓ రామకృష్ణ కౌల్చారం మండల తహసిల్దార్ శ్రీనివాస్ చారి అధ్యక్షతన గ్రామ ప్రజలను ఉద్దేశించి గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఆర్డిఓ మాట్లాడుతూ భూ సమస్యలు ఏమి ఉన్నా ఇతర గ్రామపంచాయతీ సంబంధించి సర్ ఓటరు జాబితాలు గురించి గ్రామప్రజలను తెలుసుకొని ఇలాంటి సమస్యనైనా తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా నాయన జలాల్పూర్ ఊర చెరువులో కబ్జా చేసి వరి నాటు వేయడం జరిగిందని గ్రామ ప్రజలు ఆర్డిఓ తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామసభను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్ ఆర్ ఐ సుమలత జిపిఓ పద్మ పంచాయతీ కార్యదర్శి మౌనిక అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్ నవనీత సర్పంచ్ దేవ్ సింగ్ ఉపసర్పంచ్ వెంకట నర్సింలు నాయకులు రాయన్న ఏగొండ మల్లేశం మరియు వార్డు సభ్యులు పాల్గొనడం జరిగింది.

# రైతుల సంక్షేమాన్ని గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం

### ఆరు గ్యారెంటీలు.. హామీల అమలులో ఘోర వైఫల్యం

### సంగారెడ్డిలో రైతు అవగాహన సదస్సు, వంటావార్పు

### ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి బ్యూరో , సెప్టెంబర్ 4 (సింగిడి):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు, వంటావార్పు కార్యక్రమాలను నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఫ్లెక్సీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూలి .. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతుబంధు, రైతు కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలిచేందుకు రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. రైతు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందేలా రైతుబీమా పథకాన్ని అమలు చేశామని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్, ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. రైతును కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసిందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను సంబరంగా జరుపుకోవాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చింత ప్రభాకర్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా సంబరాలు ఎలా జరుపుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీల పరిస్థితి మరింత దారుణంగా ఉందని




ఆరోపించారు. రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు కల్పించిన భరోసా, ప్రస్తుత పాలనలో కనిపించడం లేదన్నారు. "కేసీఆర్ ప్రభుత్వం రైతును కేంద్రంగా చేసుకుని పాలన సాగించింది. రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం, రైతుబీమా ద్వారా ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్ ద్వారా వ్యవసాయానికి అండగా నిలిచాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం




రైతుల సమస్యలను పట్టించుకోకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తోంది" అని అన్నారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు తదితర వనరులను సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం..**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆపదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎప్పటికీ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీహరి, కొండల్ రెడ్డి, మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు విఠల్, మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, సదాశివపేట పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న, పట్టణ కార్యదర్శి వీరేశంతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## యు ఎస్ ఎఫ్ ఐ తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

### రాష్ట్ర పీనరీ సమావేశాల సందర్భంగా పాట సిడి ఆవిష్కరణ

### రాష్ట్రంలో సాంస్కృతిక ఉద్యమాన్ని చేపడతాం

### యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి

**సంగారెడ్డి బ్యూరో ,సెప్టెంబర్ 4 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల సందర్భంగా పాట సిడినీ ఆయన చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. పాటల సీడి ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర యు ఎస్ ఎఫ్ ఐ అధ్యక్షుడు తాటికొండ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాటికొండ రవి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు సంగారెడ్డి పట్టణంలో సెప్టెంబర్ 18 ,19 మరియు 20 తేదీలలో నిర్వహించబోతున్నాం . ఈ సందర్భంగా ఈ ప్లీనరీ సమావేశాల జయప్రదానికై పాటలను విడుదల చేయడం జరుగుతుందని అలాగే ఈ ప్లీనరీ సమావేశంలో సందర్భంగా సాంస్కృతిక ఉద్యమాన్ని కూడా చేపడతామని ఆయన తెలిపారు. పాట రచన గానం పొన్న సంపత్, మాటలు తాటికొండ రవి పాటలను సమర్పించు వారు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి మాదం తిరుపతి పాటలను రూపొందించడం జరిగిందని అన్నారు. పాటల యొక్క ప్రధాన ఉద్దేశం విద్యారంగంలో వస్తున్నటువంటి సమస్యలు భవిష్యత్తు విద్యార్థులు ఉద్యమాలకు దారులు వేయాలనే ఉద్దేశంతో విద్యార్థులను మేధావులను విద్యావేత్తలను చైతన్యపరిచే వేదికగా ఖూఫీ× ప్లీనరీ సమావేశాలు జరగబోతున్నాయని తెలియజేసే విధంగా ఈ పాటలను రూపొందిం




చడం జరిగిందని పేర్కొన్నారు. పాటలను విద్యార్థులను ఉత్తేజపరుస్తూ భవిష్యత్తు ఉద్యమాలను మరింత ముందుకు తీసుకు పోవడం కోసం కృషి చేస్తాయని అన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల వల్ల విద్యా వ్యవస్థ పూర్తిగా కార్పొరేటీకరణ ప్రైవేటీకరణ వైపు వెళుతున్న ఈ నేపథ్యంలో ఇది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుందని అన్నారు. హలో విద్యార్థి - చలో సంగారెడ్డి అనే నినాదంతో ఈ పాటలను రూపొందించడం జరిగింది. కావున ప్రతి ఒక్క విద్యార్థి విద్యావేత్తలు, మేధావులు ఈ ప్లీనరీ జయప్రదానికై అందరూ సంగారెడ్డికి కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సిడి ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందీప్, ప్రశాంత్ జిల్లా నాయకులు అనిల్, దుర్గా, రుక్మిణి, జశ్విక, ధరణి, ప్రియాంక, సాహితీ, చందన, సంతోష, బావ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల సమరభేరి!





**కౌల్చారం, సెప్టెంబర్ 4 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక నర్సాపూర్ శాసనసభ్యురాలు శ్రీమతి వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా , అటు రైతులను ఇటు ప్రజలను పూర్తిస్థాయిలో మోసం చేసిందని కౌడిపల్లి బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు సారా రామా గౌడ్ అన్నారు . రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, యూరియా--ఎరువుల కొరత, వరి కొనుగోళ్లు, సాగునీటి సమస్యలు తదితర రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఈ ధర్నా చేపట్టారు. అనంతరం మంత్రివర్యులు హరీష్ రావు మాట్లాడుతూ... హామీలన్నీ గాలికి వదిలి రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల సమయంలో వంద రోజుల్లో రైతులకు ఎకరాకు రూ. 15 వేల రైతుభరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు గడుస్తున్నా హామీల అమలుకు దిక్కులేకుండా చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విమర్శించారు. రైతుబంధు రూ. 15 వేలు చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. అక్కాచెల్లెమ్మలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థి భరోసా కార్డులు, ఆడపిల్లలకు స్కూటీల హామీలు ఎక్కడికి పోయాయని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రైతు మరణిస్తే కుటుంబానికి రూ. 5 లక్షల భరోసా ఇచ్చిన రైతుబీమా గొప్ప పథకమన్నారు. కరోనా, నోట్ల రద్దు వంటి సంక్షోభాల్లోనూ రైతుబంధు ఆగలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిందన్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతలు, లో వోల్టేజ్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రైతుబంధు లేదు, రైతుబీమాపై స్పష్టత లేదు, కరెంటు సక్రమంగా లేదని విమర్శించారు. మరోవైపు యూరియా, డీఏపీ వంటి ఎరువుల కోసం రైతులు క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోందన్నారు. ఎరువుల ధరలు పెరిగి రైతులపై పెట్టుబడి భారం అధికమైందన్నారు. యాప్‌ల పేరుతో ఎరువుల కోసం రైతులను కార్యాలయాలు, దుకాణాల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. శివంపేట, రామాయంపేట, దుబ్బాక, మాసాయిపేట ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు ఆందోళనలు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపణ

### కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నిరసన

**కీసర సెప్టెంబర్ 4 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్', 'వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు చేశారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్లి ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 77 సార్లు ఢిల్లీకి వెళ్లారని మల్లారెడ్డి పేర్కొన్నారు. 22ఏ అంశంతో రాష్ట్రంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అందుకే మళ్లీ కేసీఆర్



నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, మాజీ చైర్పర్సన్ ప్రణిత శ్రీకాంత్ గౌడ్,ఎతీం పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,సాయినాథ్, ప్రభాకర్ రెడ్డి,ఎతీం పార్టీ మండలం మున్సిపాలిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, శ్రీధర్, తిరుపతి రెడ్డి,మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్లు మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దర్గపల్లిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**నంగునూరు, సెప్టెంబర్ 4 (సింగిడి):** శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని దర్గపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎంపీయూపీఎస్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధమ్మ, గోపికల వేష ధారణలో పాల్గొని సందడి చేశారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, ఉత్సాహ భరితమైన ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు వేణువు, నెమలి పింఛంతో ముస్తాబై చూపరులను ఆకట్టుకోగా, రాధమ్మలు, గోపికల వేషధారణలో పాల్గొన్న విద్యార్థినులు సంప్రదాయ వస్త్ర ధారణతో అలరించారు. చిన్నారుల ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంబర్ల శైలజ రమేశ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు, రాధమ్మ, గోపికల వేషధారణలో చిన్నారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చిన్ననాటి నుంచే పరిచయం చేయవచ్చని తెలిపారు. పిల్లల్లో కేవలం విద్యా సామర్థ్యమే కాకుండా సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక స్పృహ పెంపొందించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఇలాంటి వేడుకలను ప్రతి సంవత్సరం మరింత ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో పండుగల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు పండుగల ప్రాధాన్యత, వాటి వెనుక ఉన్న విలువలు సులభంగా అర్థమవుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. పుస్తక విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు యాదవరెడ్డి, నాగలత, పరమేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, వార్డు సభ్యులు గొడుగు ప్రసాద్, విజయ నారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, జీల శ్రీనివాస్, ఆనంద్, రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎనగండ్ల గ్రామంలో ఎస్సీలకు రిజర్వేషన్ ఏదీ?

### 80 ఏళ్ల స్వాతంత్ర్యంలోనూ దక్కని రాజకీయ ప్రాతినిధ్యం

### ఎస్సీ సర్పంచ్, ఎంపీటీసీ రిజర్వేషన్ కల్పించాలని

### ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతి



**కౌల్చారం,సెప్టెంబర్ 4 (సింగిడి):** కౌల్చారం మండలంలోని ఎనగండ్ల గ్రామంలో ఎస్సీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎస్సీ వర్గాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో ఎస్సీ సర్పంచ్ పదవికి, ఎంపీటీసీ స్థానానికి రిజర్వేషన్ కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, రాజ్యాంగం అమలులోకి వచ్చి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఎస్సీలకు స్థానిక సంస్థల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీల పట్ల వివక్ష ఎందుకు చూపుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు ఎంపీడీవో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు, మెమోరాండాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏనగండ్ల గ్రామంలోని సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించి తమకు న్యాయం చేయాలని వారు కమిషన్ చైర్మన్‌ను కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఎడిటోరియల్

Editorial



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు

## మూడు కుర్చీలు.. ఆశల జాతర!

**దసరాకు ముహూర్తం? నల్గొండ లెక్కే కీలకం**

తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ మళ్లీ హాట్‌టాపిక్‌గా మారింది. రాష్ట్ర మంత్రివర్గంలో 18 మందికి అవకాశం ఉండగా, రెండు బెర్తులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి. కొండా సురేఖ మంత్రివర్గం నుంచి తప్పుకోవడంతో మరో స్థానం ఖాళీ అయింది. దీంతో మూడు బెర్తుల భర్తీపై ఆశావహుల దృష్టి కేంద్రీకృతమైంది. దసరా నాటికి విస్తరణ ఉండవచ్చన్న ప్రచారంతో రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

**"ఒక్క బెర్తు భర్తీ చేస్తే ఒక వర్గం సంతోషం... పక్కన పడితే మరో వర్గం అసంతృప్తి!"**

**ఢిల్లీలో ప్రయత్నాల జోరు**
మంత్రి పదవిని ఆశిస్తున్న పలువురు నేతలు ఢిల్లీ పర్యటనలు చేసి అధిష్ఠానం వద్ద తమ వాదనలను వినిపిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. గడ్డం ప్రసాద్‌కుమార్, మల్లిరెడ్డి రంగారెడ్డి, కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితర పేర్లు చర్చలో ఉన్నాయి. పార్టీ సేవలు, ప్రజల్లో పలుకుబడి, గెలుపు సామర్థ్యం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే శక్తి, అధిష్ఠానంతో సమన్వయం వంటి అంశాలు ఎంపికలో కీలకమయ్యే అవకాశం ఉంది.

**బీసీ కోటా.. ఎవరి చేతికి?**
కొండా సురేఖ స్థానంలో బీసీ లేదా మహిళా ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వవచ్చన్న చర్చ జరుగుతోంది. బీసీ సమీకరణంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు బలంగా వినిపిస్తోంది. మున్నూరు కాపు వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ ఉంది. యాదవ సామాజిక వర్గం నుంచి పాలకుర్తి ఎమ్మెల్యే వీర్లపల్లి ఇలయ్య, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పేర్లు కూడా చర్చలో ఉన్నాయి. నవీన్‌కు అవకాశం ఇస్తే యాదవ, యువత, హైదరాబాద్ రాజకీయాల లెక్క ఒకేసారి కలిసొస్తుందన్న అంచనాలున్నాయి.

**ఎస్టీ కోటా.. నల్గొండ లెక్కే చిక్కు!**
"పదవి ఒక్కటే... దాని వెనుక సమీకరణాలెన్నో!"
ఎస్టీ వర్గంలో లంబాడా ప్రాతినిధ్యంపై చర్చ సాగుతోంది. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. బాలు నాయక్‌కు అవకాశం ఇస్తే ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి మూడో మంత్రి అవుతారు. ఇప్పటికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. ఈ జిల్లా సమీకరణం నేపథ్యంలో రామచంద్ర నాయక్ పేరు కూడా పరిశీలనలో ఉండవచ్చన్న ప్రచారం ఉంది.

**రాజగోపాల్‌రెడ్డి.. సున్నితమైన లెక్క**

కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చాలాకాలంగా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అయితే ఆయన సోదరుడు వెంకట్‌రెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటం సున్నితమైన అంశం. ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి అవకాశం ఇవ్వడంపై విమర్శలు రావచ్చన్న వాదన ఉంది. అదే సమయంలో రాజగోపాల్‌రెడ్డి రాజకీయ బలాన్ని విస్మరించలేమన్న అభిప్రాయం కూడా ఉంది. గడ్డం ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా, మహేశ్‌కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నందున, వారిని మంత్రివర్గంలోకి తీసుకోవాలంటే ఆ కీలక పదవులపై కూడా కొత్త నిర్ణయాలు అవసరం.

**మహిళా కోణంలో విజయశాంతి?**
కొండా సురేఖ స్థానంలో మహిళా ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలన్న ఆలోచన ఉంటే సీనియర్ నాయకురాలు విజయశాంతి పేరు కూడా పరిశీలనకు రావచ్చన్న ప్రచారం ఉంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేదు.

**"నేటి ఎంపిక... రేపటి ఎన్నికలకు లెక్క!"**
**రేవంత్‌కు అగ్నిపరీక్ష**
జీహెచ్ఎంసీ ఎన్నికలు, ఆ తర్వాతి అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుంటే మూడు బెర్తుల ఎంపికకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. సామాజిక, ప్రాంతీయ సమతుల్యతతో ఎంపికలు చేస్తే కాంగ్రెస్‌కు బలం చేకూరవచ్చు. లెక్క తప్పితే కొత్త అసంతృప్తికి తావు ఏర్పడవచ్చు. మూడు కుర్చీలు కేవలం మంత్రి పదవులు కావు... రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం రాజకీయ దూరదృష్టికి అసలైన పరీక్ష!

## చాలా దయనీయమైన దృశ్యం..



మనకు ఎక్కువై వదిలేసిన ముక్కలు..
ఆ పాప ఏరుకుంటుంటే గుండె ముక్కలైపోతుంది...కదా !
ఆ చిన్ని చేతుల తో మెతుకు కోసం దేవులాడుతుంటే..
దేవుడెక్కడున్నాడు అనిపిస్తుంది..కదా ! ఆ కళ్లలో ఈ ఒక్కపూట
అయినా తృప్తి గా తినొచ్చు అనే ఆశ ...ఆ చిన్నారి ముఖాన్ని
చూస్తుంటే.... ఈ దేశ పేదరికపు ముఖచిత్రం కనిపిస్తుంది...కదా !
దయచేసి ఆహారాన్ని వృధా చేయొద్దు...దాని అవసరం కోట్లాది
మంది చిన్నారులకు చాలా ఉందని గుర్తిద్దాం...!! మనం నిర్వహించే
శుభకార్యాల్లో....మనం హాజరయ్యే కార్యక్రమాల్లో ఆహారం వృథా
కాకుండా చూడటం మన బాధ్యత కదా ! ఆ క్షణం లో మాసి పోయిన
బట్టలతో...బక్కచిక్కిన శరీరం తో నిత్యం ఆకలి తో స్నేహం చేస్తున్న
బిడ్డల్ని తలచుకుందాం..! కోట్లాది నిర్భాగ్యుల ఆకలి కేకలు ఒక్కసారి
విందాం..!! డొక్క ఎండిపోయి దిగాలు గా దిక్కులు చూస్తున్న
చిన్నారుల ముఖాలను ఒక్కసారి గుర్తు చేసుకుందాం...!!

– గిరి ప్రసాద్ సోముల, జర్నలిస్ట్

## 'గురు'దీవెన

రేపటి నవతరం నిర్మాతలు..
నేటి తరం మహా మేధావులు
చిన్నారుల మనోవికారాలకు..
లేపనం అద్దే గురువైద్యులు..
నైతికతకు పట్టం కట్టే పుణ్యాత్ములు
చిన్నారుల్ని మొక్కలుగా భావించి..
మూర్తిమత్వాన్ని పండించే రైతులు
వ్యక్తిత్వాన్ని నిర్మించే ఇంజనీర్లు
న్యాయ దారి చూపే న్యాయవాదులు
బెత్తెం పట్టి తప్పులను సవరించే..
సున్నిత మనసున్న మాస్టార్లు
అపాయాలకు ఉపాయాలు చెప్పే..
ఉపాధ్యాయ మానవోత్తములు
మేధలో సద్బుద్ధి మొక్కలు నాటే..
'గురు'తరం గౌరవ తోటమాలులు
పౌర సమాజానికే మార్గదర్శకులు..
గురుకులం పండితోత్తములు
అజ్ఞాన చీకట్లను తరిమి కొట్టి..
జ్ఞాన వెలుగులు నింపే గురువులు
పుస్తక పాఠ్యాంశాలతో పాటు..
జీవిత పాఠాలు నేర్పే గురు దేవుళ్లు !

– మధుపాలీ
9949700037

# ఎందరో సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దిన మారేడ్ పల్లి జూనియర్ టెక్నికల్ హై స్కూల్ ఇక కనుమరుగుకానుందా!

**స్వాతంత్ర్యానంతరం హైస్కూల్ విద్య పూర్తయిన వెంటనే బలమైన సాంకేతిక శ్రామిక శక్తిని నిర్మించడానికి ముదలియార్ కమిషన్ (1952--53 నాటి సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్) సెకండరీ విద్యలో వైవిధ్యీకరణను బలంగా సమర్థించింది. దీని ఫలితంగా భారతదేశం అంతటా బహుళార్థసాధక ఉన్నత పాఠశాలలు మరియు జూనియర్ టెక్నికల్ ఉన్నత పాఠశాలల భావన ఆవిర్భవించింది. ఆచరణాత్మక వృత్తి విద్యను సులభతరం చేయడానికి సాంకేతిక సంస్థలు మరియు జూనియర్ టెక్నికల్ స్కూళ్లు తొలుత కీలక పారిశ్రామిక పట్టణాలకు మరియు అప్పటికే ఉన్న పాలిటెక్నిక్ లకు అనుబంధంగా లేదా వాటి సమీపంలో ఏర్పాటు చేయబడ్డాయి.**




**పారిశ్రామికీకరణకు ప్రాధాన్యం:**
1947లో స్వాతంత్ర్యానంతరం భారతదేశం బలహీనమైన ఆర్థిక వ్యవస్థ మరియు తీవ్రమైన ఆహార కొరతతో కొట్టుమిట్టాడుతుంది. ఈ పరిస్థితి నుండి దేశాన్ని గట్టెక్కించడానికి సహజంగానే సోషలిస్ట్ భావజాలం గల తొలి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ సోవియట్ రష్యా ఆర్థిక విధానాల పట్ల ఆకర్షితుడవ్వడంతో పాటు ఆనాటి ఆర్థికవేత్తలు, శాస్త్రవేత్తలు మరియు పారిశ్రామికవేత్తల సిఫార్సుల మేరకు పంచవర్ష ప్రణాళికలను ప్రారంభించారు. 1951 నుండి 1956 వరకు మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రాధాన్యతను, 1956 నుండి 1961వరకు రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో పారిశ్రామిక పురోగతి కోసం పారిశ్రామికీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. మాధ్యమిక విద్య అనేది యువతకు జీవనోపాధి సంపాదించడానికి మరియు జాతీయ ఉత్పాదకతకు సహాయపడటానికి ఆచరణాత్మక మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను అందించే ఒక సంపూర్ణ, స్వయం సమృద్ధి గల దశగా ఉండాలని ప్రభుత్వం కోరుకుంది. అయితే, దేశంలో అప్పటికీ ఇంకా కొనసాగుతున్న బ్రిటిష్ విద్యా విధానం పారిశ్రామిక ప్రగతికి దోహదం చేయదని, అందుకు తగు సంస్కరణలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని భావించి అవసరమైన సిఫార్సులను సూచించేందుకు సెప్టెంబర్ 23, 1952న భారత ప్రభుత్వం అప్పటి మద్రాసు విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ డా ఎ లక్ష్మణస్వామి ముదలియార్ అధ్యక్షతన సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్, 1952-53 ను నియమించింది.

**ముదలియార్ కమిషన్ (సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్):**
బహుళ ప్రయోజన (మల్టీ పర్పస్) పాఠశాలలను ప్రవేశపెట్టడం ద్వారా కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా ముందుకు సాగడంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను తీర్చిదిద్దడానికి సాంకేతిక మరియు వృత్తివిద్యా విభాగాలను (అనువర్తిత గణితం, మెకానికల్ మరియు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అంశాలు వంటివి) జోడించాలని ముదలియార్ కమిషన్ ప్రధానంగా ప్రతిపాదించింది. ప్రామాణిక సబ్జెక్టులతో పాటు సాంకేతిక, వ్యవసాయ, వాణిజ్య, మరియు ఆచరణాత్మక వృత్తి విద్యా కోర్సులను జోడించాలని సూచించింది. ముదలియార్ నివేదికలోని ఆలోచనలను భారతదేశ రెండవ పంచవర్ష ప్రణాళికలో పొందుపరిచారు. పాక్షిక నైపుణ్యం గల కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి జూనియర్ టెక్నికల్ పాఠశాలల ఏర్పాటుకు ఈ ప్రణాళిక నిధులు సమకూర్చింది. స్థానిక ఆర్థిక అవసరాలను తీర్చడానికి గ్రామీణ సెకండరీ పాఠశాలలు ప్రత్యేక వ్యవసాయ మరియు చేతివృత్తుల కార్యక్రమాలను జోడించాయి. విద్యను మరింత ఉపయోగకరంగా, విద్యార్థి కేంద్రీకృతంగా మరియు నిజ జీవితానికి అనుసంధానంగా మార్చిన ముదలియార్ కమిషన్ భారతదేశంలో మాధ్యమిక స్థాయిలో వృత్తిపరమైన మరియు సాంకేతిక విద్యను ప్రవేశపెట్టే విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ కమిషన్ ప్రతిపాదనలు రెండవ పంచవర్ష ప్రణాళిక (1956--1961) యొక్క విద్యాపరమైన లక్ష్యాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేశాయి.

**జూనియర్ టెక్నికల్ హై స్కూళ్ల ఏర్పాటు:**
ముదలియార్ కమిషన్ (సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్, 1952-53) సిఫార్సులను అనుసరించి, 1 నవంబర్ 1956 భాషా ప్రాతిపదికన ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆరు జూనియర్ టెక్నికల్ హై స్కూళ్ల (జెటిహెచ్ఎస్)ను (1969-70 విద్యా సంవత్సరంలో వీటిని బాలుర టెక్నికల్ హైస్కూళ్లుగా పునర్నామకరణం చేశారు) కాకినాడ, విజయవాడ, సికింద్రాబాద్, తిరుపతి, ప్రొద్దుటూరు, మహబూబ్‌నగర్ స్థాపించింది. ఈ ప్రత్యేక వృత్తి విద్యా మాధ్యమిక పాఠశాలలు సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో పనిచేసేవి. విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణ కోసం అవసరమయ్యే ముడి పదార్థాలను సమకూర్చుకునేందుకు జూనియర్ టెక్నికల్ హై స్కూళ్ళకు కేంద్ర ప్రభుత్వం నుండి నేరుగా నిధులు అందేవి. విద్యార్థులకు ప్రాథమిక సాంకేతిక విద్య మరియు ఆచరణాత్మక వృత్తి శిక్షణను అందించడానికి, ఈ సంస్థలను ఈ ప్రాంతాలలో అప్పటికే ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలకు వ్యూహాత్మకంగా అనుసంధానించారు. జూనియర్ టెక్నికల్ హై స్కూళ్ళు పాలిటెక్నిక్ డిప్లొమాలకు ప్రత్యక్ష వారధిగా పనిచేసేవి. దీని పాఠ్యప్రణాళికలో భాగంగా విద్యార్థులు ప్రామాణిక విద్యా విషయాలతో పాటు, సుశిక్షిత ప్రయోగాత్మక వర్క్‌షాప్ శిక్షణను అభ్యసించేవారు. ఇక్కడ చదివిన విద్యార్థులకు ఫ్లోర్-లెవల్ ఇంజనీరింగ్, టెక్నికల్ అప్రెంటిస్‌లుగా రైల్వేలు, రక్షణ ప్రయోగశాలలు, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలు వంటి ప్రత్యేక ప్రభుత్వ రంగ సంస్థలలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉండేవి. కొందరు విద్యార్థులు జూనియర్ టెక్నికల్ హై స్కూళ్ల తరువాత పాలిటెక్నిక్ లో డిప్లొమా మరియు ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఎన్నో ఉన్నత స్థానాలకు కూడా చేరుకున్నారు. అప్పట్లో జెటిహెచ్ఎస్ ను ఇంజనీరింగ్‌కు ప్రత్యామ్నాయ మార్గంగా భావించేవారు. ఈ వ్యవస్థలోని కఠినమైన ప్రాక్టికల్ శిక్షణ మరియు డ్రాయింగ్ అంశాలు, సాంప్రదాయ హైస్కూళ్ల కంటే విద్యార్థులకు బలమైన సాంకేతిక నైపుణ్యాన్ని పునాదిని అందించాయని పూర్వ విద్యార్థులు తరచుగా పేర్కొంటారు. ఇది చాలా మంది విద్యార్థులను ఉన్నత ఇంజనీరింగ్ డిప్లొమాలు మరియు సాఫ్ట్‌వేర్, కోర్ మెకానికల్ రంగాలలో వృత్తిలోకి సులభంగా మారడానికి వీలు కల్పించింది. ప్రత్యేకించి 1970 మరియు 1980 దశకాలలో చాలా మంది పూర్వ విద్యార్థులు సికింద్రాబాద్ టెక్నికల్ స్కూల్‌ను ఒక లాంచ్‌ప్యాడ్‌గా ఉపయోగించుకుని, నేరుగా ప్రముఖ రాష్ట్ర పాలిటెక్నిక్‌లలో లేదా ప్రత్యేక మేనేజ్‌మెంట్ మరియు టెక్నికల్ సర్టిఫికేషన్‌లలో చేరడం విశేషం. అయితే, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం యొక్క జి.ఓ.ఎం.ఎస్.నం. 1003 తేదీ: డిసెంబర్ 11, 1981 ద్వారా సికింద్రాబాద్ లోని జెటిహెచ్ఎస్ "గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలెక్ట్రానిక్స్" గా మారింది. అప్పటి నుండి ఈ సంస్థ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలెక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా మరియు సెమి కండక్టర్ టెక్నాలజీలలో 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా కోర్సులను అందిస్తోంది.

**వృత్తి నిపుణుల కొరతకు చెక్ పెట్టేదేలా?**
భారతదేశంలో ఇంజనీరింగ్ కళాశాలల ఇబ్బడిముబ్బడి విస్తరణ, సమాజ దృష్టిని అవసరమైన వాణిజ్య నైపుణ్యాల నుండి మళ్లించడం ద్వారా, నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణుల కొరతను గణనీయంగా సృష్టిస్తోంది. నేటి సమాజం తరచుగా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బిటెక్) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ (బిఇ) డిగ్రీని ఉన్నత స్థాయి విద్య మరియు ఉపాధి మార్గంగాను, ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐలు) మరియు పాలిటెక్నిక్ డిప్లొమాలు తక్కువ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఎంపికలుగా ముద్ర వేయడంతో మన దైనందిన జీవితంలో అవసరమయ్యే ప్లంబర్లు, ఎలెక్ట్రిషియన్లు, కార్పెంటర్లు, వెల్డర్లు, కమ్మరి, కుమ్మరి, కంసాలి, చేనేత వృత్తి నిపుణులు క్షేత్రస్థాయిలో నానాటికీ తగ్గిపోతున్నారు. ఇది "అందరూ పల్లకీలో కూర్చుంటే, మోసేదెవరు?" అన్న సామెతను గుర్తు తెస్తుంది. ఈ పరిస్థితులలో విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు సభ్య సమాజం వైట్ కాలర్ జాబ్స్ మరియు గ్రే కాలర్ జాబ్స్ (ఉచ్ఛ మరియు నీచ) అనే భావనకు స్వస్తి పలికి వృత్తి నైపుణ్యాన్ని గౌరవించే సంస్కృతి అలవర్చుకుంటేనే సమాజంలోని అన్ని వర్గాల మరియు అన్ని స్థాయిల వ్యక్తులు ప్రశాంతమయ జీవితాన్ని గడపగలుగుతారు. పార్టీల రహితంగా ప్రభుత్వాలు నిర్హేతుకమైన సంక్షేమ పథకాలను రద్దుచేసి దేశాభివృద్ధికి దోహదపడే సాంకేతిక వృత్తి నిపుణులను మరియు శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా యుద్ధప్రాతిపదికన కృషి చేయాలి.

**ప్రభుత్వ నిరాదరణకు గురవుతున్న మారేడ్ పల్లి గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలెక్ట్రానిక్స్:**
ఎంతో మంది ప్రముఖ ఇంజనీర్లు మరియు సాంకేతిక నిపుణులకు కొన్ని దశాబ్దాల పాటు ప్రాథమిక వేదికగా నిలిచిన ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు నేడు ప్రభుత్వ తోడ్పాటు కరువవుతోందని ఇప్పుడు దాదాపు 60 నుండి 80 సంవత్సరాల వయసులో ఉన్న ఆ సంస్థ యొక్క పూర్వ విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెటిహెచ్ఎస్ మారేడ్ పల్లిలో విద్యాభ్యాసం కారణంగానే తమకు ప్రతిష్ఠాత్మక సంస్థలలో ఉద్యోగావకాశాలు లభించడంతో పాటు ఉన్నత పదవులు పొంది ఆనందమయ జీవితం గడపగలుగుతున్నామని తెలిపారు. కారణాలేమైతేనేమి, సికింద్రాబాద్ కు గుండెకాయ లాంటి ఈస్ట్ మారేడ్ పల్లిలో గల ఈ సంస్థ యొక్క అత్యంత విలువైన స్థలాన్ని విక్రయించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. జెటిహెచ్ఎస్ మారేడ్ పల్లి పూర్వ విద్యార్థులుగా తాము ఈ ప్రతిపాదనను విరమించుకోవాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. గతంలో దివంగత టంగుటూరి అంజయ్య ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వం 1981లో స్థాపించబడిన వీఌ= (వీఢ్తీబంతీఱ) ఇంజనీరింగ్ కళాశాలకు కొన్ని సబ్జెక్టులకు సంబంధించి ప్రయోగశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో జెటిహెచ్ఎస్ మారేడ్ పల్లి ప్రాంగణంలోని వసతులను ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించింది అని, ఆ తరువాత జెటిహెచ్ఎస్ విద్యార్థులు తీవ్ర ఆందోళన చేయడంతో 1985లో వీఌ= ఇంజనీరింగ్ కళాశాల జెటిహెచ్ఎస్ లోని వసతులను వినియోగించుకోవడం ఆగిపోయిందని కొందరు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ నెల 5వ తేదీన భారత మాజీ రాష్ట్రపతి డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరుపుకునే "గురు పూజా దినోత్సవం" నాడు "గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలెక్ట్రానిక్స్" (ఒకప్పటి జిటిహెచ్ఎస్) మారేడ్ పల్లిలో "పూర్వ విద్యార్థుల సమ్మేళనం" నిర్వహిస్తున్నామని, ఈ వేడుకలలో 60 నుండి 80 సంవత్సరాల మధ్య వయసు గల రెండు వందల పై చిలుకు పూర్వ విద్యార్థులు పాల్గొంటారని ప్రముఖ సంఘ సేవకులు, భూగర్భ నీటి సంరక్షకులు మరియు బిహెచ్ఈఎల్ మాజీ జనరల్ మేనేజర్ రాజాపేట ఆంజనేయులు తెలిపారు.

**యేచన్ చంద్ర శేఖర్**
**మాజీ రాష్ట్ర కార్యదర్శి**
**ది భారత్ స్కౌట్స్ & గైడ్స్,**
**తెలంగాణ**
**హైదరాబాద్**
**? 8885050822**



ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం

Singidi శనివారం 05-9-2026

## కేసీఆర్-కేటీఆర్‌ది ప్రజాతీర్పుపై అక్కసే

- కాంగ్రెస్ పాలనలో రైతులు, పేదలు, మహిళలు, యువతకు మేలు జరుగుతోందని వెల్లడి
- కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్‌కుమార్



**కరీంనగర్, సెప్టెంబర్ 3(సింగిడి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ప్రజా తీర్పుపై వారి అక్కసును ప్రతిబింబిస్తున్నాయని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయం ఇందిరాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. రుణమాఫీ, రైతుభరోసా, 70 వేల ఉద్యోగాల భర్తీ, 15 లక్షల కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి చర్యలు కూడా చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఇప్పటికే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన తీర్పు ఇచ్చారని, గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, వైఫల్యాలపై ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని అంజన్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలతో వారిని తప్పుదోవ పట్టించలేరని అన్నారు. సమావేశంలో ఆర్జీపీఆర్ఎస్ జిల్లా చైర్మన్ మడుపు మోహన్, కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శులు ఇమ్రాన్, కంకణాల అనిల్, పహాడ్ ఇమ్రాన్ ఘని, శ్రీనివాస్, ఖదీర్, ప్రశాంత్‌గౌడ్, పాండుర్ల విజయ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## భగత్‌నగర్‌లో ఘనంగా శ్రీ విఘ్నేశ్వర మండప కర్ర పూజ



- ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

**కరీంనగర్, సెప్టెంబర్4(సింగిడి):** భగత్‌నగర్‌లో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న శ్రీ విఘ్నేశ్వర మండపానికి సంబంధించిన కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి కర్ర పూజను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం సభ్యులు డోలీ ఉపేందర్, తోట శ్రీకాంత్, సుద్దాల రామగౌడ్, బీమరి సత్యం, గంప మొండయ్య, కడార్ల విమల్, రోహిత్, సాయి, బన్నీ, అరవింద్‌తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంతోషిమాత ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతపూజలు

- వందలాదిగా తరలివచ్చిన మహిళా భక్తులు..
- 1000 మందికి అన్నసంతర్పణ
- ఆలయ కమిటీ చైర్మన్ కొక్కిరాల సాగర్‌రావు



**కరీంనగర్, సెప్టెంబర్4(సింగిడి):** సంతోష్‌నగర్‌లోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం మహాహారతి నిర్వహించారు. అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన, హోమం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. వందలాది మంది మహిళా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ఓడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ కొక్కిరాల సాగర్‌రావు మాట్లాడుతూ.. వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటే సకల సంపదలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసమన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, మధ్యాహ్నం సుమారు 1000 మందికి అన్నసంతర్పణ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రంగు సత్యనారాయణ, కోశాధికారి భోగ పరమేశ్వర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### మహిళలను మోసం చేస్తున్న

## కాంగ్రెస్ ప్రభుత్వం

1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 04 (సింగిడి):** మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారి సంక్షేమాన్ని గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో "మహిళా సదస్సు" నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారు, రాష్ట్ర నాయకులు శ్రీ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) గారు పాల్గొని మహిళల సమస్యలపై వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను నిలిపివేయడం ద్వారా మహిళలు, తల్లులు, శిశువులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. మహిళల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగాశ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**నంగునూరు, సెప్టెంబర్4(సింగిడి):** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నంగునూరు మండల కేంద్రంలో నంగునూరు గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని నామస్మరణతో ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. నినాదాలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా "జై శ్రీకృష్ణ"నినాదాలతో నంగునూరు మండల కేంద్రం మార్మోగింది. యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని సంఘం నాయకులు తెలిపారు. శ్రీకృష్ణుడి బోధనలు, ఆదర్శాలను ప్రజలు ఆచరించాలని వారు పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ర్యాలీలో నంగునూరు గ్రామ యాదవ సంఘం నాయకులు, సభ్యులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## గురు రవిదాస్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

జిల్లావ్యాప్తంగా సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం



**కరీంనగర్, సెప్టెంబర్4(నినాదం):** కుల వివక్షకు తావులేని సమసమాజ స్థాపన, సామాజిక సమరసత కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప ఆధ్యాత్మిక సంస్కర్త సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం కొనియాడారు. గురు రవిదాస్ 650వ జయంతి సందర్భంగా బీజేపీ జాతీయ, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లోని శుభమంగళ్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు, మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో సాయిని మల్లేశం మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అణగారిన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రవిదాస్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల స్థాయిలో 'సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్' నిర్వహించాలని సూచించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, కార్యక్రమ కన్వీనర్ బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గ్రామాల్లోని దళితవాడలను సందర్శించి రవిదాస్ బోధనలు, సమానత్వ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. శోభాయాత్రలు, ప్రత్యేక పూజలు, వస్త్రదానం, అన్నదానం, విద్యార్థులకు పుస్తకాల పంపిణీతో పాటు యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. రవిదాస్ జన్మస్థలం నుంచి సేకరించిన పవిత్ర మట్టి కలశాన్ని జిల్లాకు తీసుకువచ్చామని, ప్రతి మండలానికి తీసుకెళ్లి కలశ వందన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మండలాల ప్రతినిధులకు కలశాలను అందజేశారు. రవిదాస్ చిత్రపటాన్ని అవమానించారంటూ ఇటీవల చోటుచేసుకున్న ఘటనను సాయిని మల్లేశం, బత్తుల లక్ష్మీనారాయణ ఖండించారు. రవిదాస్ సమానత్వ సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ నాయకులు, ఎస్సీ మోర్చా పదాధికారులు, వివిధ నియోజకవర్గాల కన్వీనర్లు, మండల, జోన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ఆదర్శనీయం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు



**కరీంనగర్, సెప్టెంబర్4(సింగిడి):** కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్' జిల్లా కార్యశాల శుక్రవారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ, అంకితభావాన్ని పురస్కరించుకుని బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యశాలలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉపమేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్లుగా మోదీ అందిస్తున్న పాలనలో ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకపోవడం ఆయన పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. మోదీ నాయకత్వాన్ని గుర్తించి 35కుపైగా దేశాలు తమ అత్యున్నత పురస్కారాలతో సత్కరించాయని తెలిపారు. దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ఆయన తీసుకుంటున్న నిర్ణయాలను అంతర్జాతీయ సమాజం ప్రశంసిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు, లబ్ధిదారులకు వివరించాలని నాయకులకు సూచించారు. నెల రోజుల పాటు నిర్వహించే సేవా కార్యక్రమాల్లో ప్రజలు, బీజేపీ కార్యకర్తలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేసి 'సేవా సంకల్ప్ అభియాన్'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, కార్యక్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

### నేడు కరీంనగర్‌కు

## కెటీఆర్ రాక

విద్యార్థి, యువత సదస్సులో పాల్గొననున్న కెటీఆర్

అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన గంగుల కమలాకర్, కొండూరు రవీందర్‌రావు



**కరీంనగర్, సెప్టెంబర్4(సింగిడి):** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో రేపు నిర్వహించనున్న విద్యార్థులు, యువత సదస్సుకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండూరు రవీందర్‌రావుతో కలిసి శుక్రవారం సదస్సు ప్రాంగణాన్ని పరిశీలించారు. సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు, వేదిక, ఇతర సౌకర్యాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జీవి రామకృష్ణ రావు, నగర అధ్యక్షులు చల్ల హరి శంకర్, ఏనుగు రవీందర్ రెడ్డి, పొన్నం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనేతాజీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు




**కొడంగల్, సెప్టెంబర్ 04(సింగిడి):** కొడంగల్ పట్టణంలోని శ్రీనేతాజీ విద్యాభవన్ పాఠశాల లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సరీ విద్యార్థిని-విద్యార్థులు కృష్ణుడు-రాధా, గోపిక వేషాలు ధరించి అల్లరిపనులు చేస్తూ, అందరినీ పరవశింపజేశారు. డిజె పాటలతో విద్యార్థినులు నృత్యాలు చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ అభిలాష్ రెడ్డి విద్యార్థులకు శ్రీ కృష్ణుని జన్మవృత్తంతాన్ని, కృష్ణుని జీవితాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెరువు పేరు మార్చకూడదని తెలంగాణ ముఖ్యమంత్రికి లేఖ



**వికారాబాద్ సెప్టెంబర్ 4(సింగిడి):** వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం, దౌల్తాబాద్ మండలం పరిధి ఈర్లపల్లి గ్రామంలో అనాదిగా ఈర్లపల్లి అమ్మచెరువుగా పిలువబడుతున్న చెరువు పేరు మార్చాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు భావిస్తున్న నేపథ్యంలో పేరు మార్చకూడదని గ్రామస్తులు శుక్రవారం గ్రామ సభ నిర్వహించి ముఖ్యమంత్రి కి బహిరంగ లేక వ్రాశారు. తరతరాలుగా ఈర్లపల్లి అమ్మచెరువుగా పిలువబడుతున్న మా గ్రామ చెరువు పేరును యథాతథంగా కొనసాగించవలసిందిగా మనవి చేశారు. దౌల్తాబాద్ మండలం, కొడంగల్ తాలూకా, వికారాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. మా గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువును తరతరాలుగా ఈర్లపల్లి అమ్మచెరువు అనే పేరుతోనే పిలుస్తూ వస్తున్నారు. ఈ పేరు మా గ్రామ ప్రజల జీవితాలతో, మా గ్రామ చరిత్రతో మరియు మా గ్రామ గుర్తింపుతో ఎంతోకాలంగా ముడిపడి ఉంది. అయితే ఇటీవల రెడ్డి శ్రీను, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్నట్లు మాకు తెలిసిన వ్యక్తి, మా గ్రామ చెరువును వారి గ్రామానికి చెందిన చెరువుగా పేర్కొంటూ కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ వ్యాఖ్యలు మా ఈర్లపల్లి గ్రామ ప్రజల మనోభావాలను బాధించాయి. తరతరాలుగా మా గ్రామ చెరువు ఈర్లపల్లి అమ్మచెరువు అనే పేరుతోనే గుర్తింపు పొందుతున్నందున, దానిని వేరే గ్రామం పేరుతో పిలవడం మా గ్రామ ప్రజలకు ఆమోదయోగ్యం కాదు. కావున, రెడ్డి శ్రీను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, భవిష్యత్తులో కూడా ఈ చెరువును ఈర్లపల్లి అమ్మచెరువు అనే పేరుతోనే గుర్తించేలా చూడవలసిందిగా వినయపూర్వకంగా మనవి చేస్తున్నామని పేర్కొన్నారు. చెరువు పేరు కేవలం ఒక పేరు మాత్రమే కాదని, దాని వెనుక ఎన్నో సంవత్సరాల చరిత్ర, ప్రజల జ్ఞాపకాలు, గ్రామస్తుల అనుబంధం మరియు గ్రామ గుర్తింపు ఉంటాయన్నారు. అదేవిధంగా, భవిష్యత్తులో ఎప్పుడైనా భారీ వర్షాలు, వరదలు లేదా ఇతర ప్రకృతి విపత్తుల కారణంగా గ్రామానికి నష్టం జరిగినా ఈర్లపల్లి అమ్మచెరువు అనే పేరు మా గ్రామ చరిత్రకు ఒక గుర్తుగా నిలవాలని మా గ్రామ ప్రజల ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. గ్రామం పేరు, మా చెరువు పేరు మరియు మా గ్రామ చరిత్ర భవిష్యత్ తరాలకు కూడా గుర్తుండేలా ఈర్లపల్లి అమ్మచెరువు అనే పేరును యథాతథంగా కొనసాగించడంతో పాటు, అవసరమైతే అధికారిక రికార్డుల్లో కూడా అదే పేరుతో నమోదు చేసేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వవలసిందిగా కోరుతున్నట్లు తెలిపారు. చెరువు గ్రామానికి ఒక ఆస్తి మాత్రమే కాదని అది మా తరతరాల గుర్తింపని ఈర్లపల్లి అమ్మచెరువు అనే పేరు మా గ్రామ చరిత్రకు ఎప్పటికీ గుర్తుగా నిలవాలని వివరించారు.

## సబ్బండ వర్గాల లీడర్ కొర్వి కృష్ణస్వామి : నీలం మధు ముదిరాజ్..

చిట్కుల్ లో ఘనంగా కృష్ణస్వామి జయంతి వేడుకలు..



**పటాన్చెరు, సెప్టెంబర్ 04 (సింగిడి):** శుక్రవారం కొరవి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి పురస్కరించుకొని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన నీలం మధు. హైదరాబాద్ నగర మేయర్ గా పని చేసి ఆయన ముందుచూపుతో చేసిన నగర మాస్టర్ ప్లాన్ చిరస్థాయిగా నిలిచిపోయింది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుల ముద్దుబిడ్డ మహానేత కొర్వి కృష్ణస్వామి అని, ఆయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, పాత్రికేయుడు, విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశీలి అని ఆయన బహుజనుల పక్షాన ఉండి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. ఆ మహానేత ఆశయాలను ఆయన స్ఫూర్తితో మనమంతా కలిసి ముందుకు తీసుకెళ్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
05-9-2026

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4(సింగిడి):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, మున్సిపల్, వైద్య తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ, డిస్ట్రిక్ట్ హైవే టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి, బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ, హైవే పెట్రోలింగ్, అత్యవసర వైద్య సేవలపై సమీక్షించారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న 10 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లను రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, పంచాయతీరాజ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. క్రాష్ బ్యారియర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్, లైటింగ్ తదితర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. అతివేగం, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు ముమ్మరం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ లిమిట్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై అనధికార పార్కింగ్‌ను నియంత్రించి, అవసరమైన చోట ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించేలా హైవేలపై పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. 1033 హెల్ప్‌లైన్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా హైవేల వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులపై పశువుల సంచారం వల్ల ప్రమాదాలు జరగకుండా పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్‌ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ మనోహర్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, జాతీయ రహదారుల ఈఈ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీదేవి, ఈ-డార్ డీఆర్ఎం లక్ష్మణ్, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేత్రదానం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు

వైద్య కళాశాల నేత్ర వైద్య విభాగ అధిపతి డా భరత్ కుమార్



**భూపాలపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4(సింగిడి):** నేత్రదానం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని వైద్య కళాశాల నేత్ర వైద్య విభాగ అధిపతి డా భరత్ కుమార్ తెలిపారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, భూపాలపల్లిలో నేత్రదానంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదాన ప్రాముఖ్యత, ప్రయోజనాలు ప్రజల్లో ఉన్న అపోహలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్. భరత్ కుమార్ మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు నేత్రదానంపై అవగాహన పెంచుకుని కుటుంబ సభ్యులకు కూడా దాని ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నేత్రదానం మరణానంతరం మరొకరి జీవితంలో వెలుగును నింపే మహత్తర మానవతా కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జె. హెప్సిబా, ఆప్తామిక్ అధికారి బూరుగు రవికుమార్, మురళీధర్ రెడ్డి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డుల పంపిణీ.. సర్పంచికి సమాచారం కరువు!



**కోదాడ, సెప్టెంబర్ 4 (సింగిడి):** అనంతగిరి మండలం బొజ్జగూడెం తండాలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్ గుగులోత్ నీలాబాయికి రేషన్ డీలర్ సమాచారం ఇవ్వకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ తనకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. మహిళా ప్రజాప్రతినిధిగా ఉన్న సర్పంచికి ప్రభుత్వ కార్యక్రమాలపై ముందస్తుగా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కమలాకర్ మాట్లాడుతూ.. ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచికి సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ నిబంధనల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## ఘనంగా కాంగ్రెస్ 1000 రోజుల ప్రజా పాలన సంక్షేమ ఫలాల సంబరాలు




**తిరుమలగిరి, సెప్టెంబర్ 4(సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 1000 రోజుల ప్రజా పాలన సంబరాలలో భాగంగా తిరుమలగిరి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు సుంకరి జనార్దన్ అధ్యక్షతన వెయ్యి రోజుల ప్రజా పాలన సంక్షేమ ఫలాల సంబరాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి మరియు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి గురించి వారి సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్, మాజీ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, తిరుమలగిరి మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ తిరుమణి యాదగిరి 7వ వార్డు కౌన్సిలర్ బత్తుల శ్రీనివాస్ 9వ వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన మల్లయ్య మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు మాజీ ఎంపీటీసీలు యూత్ కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపుల్లో పురుగుమందుల విక్రయాలపై నియంత్రణ అవసరం



**చింతపల్లి, సెప్టెంబర్ 4(సింగిడి):** మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో పురుగుమందులను ఎవరికి పడితే వారికి విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నల్ల ఆంజనేయులు కోరారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఫర్టిలైజర్ షాపుల్లో పురుగుమందులు కొనుగోలు చేసే రైతుల నుంచి ఆధార్ కార్డు, రైతు పట్టాదారు పాస్‌బుక్ వివరాలను పరిశీలించిన అనంతరం మాత్రమే మందులను విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా మైనర్లకు, వ్యవసాయ భూమి లేని వ్యక్తులకు పురుగుమందులు విక్రయించకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. పురుగుమందులు సులభంగా లభించడం వల్ల వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని, వివిధ కారణాలతో పురుగుమందులు సేవించి ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని నల్ల ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భద్రతతో పాటు ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని ఫర్టిలైజర్ షాపులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆయన కోరారు.



# మల్లూరులో బీఆర్ఎస్ రాస్తారోకో...

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై ధ్వజం
- ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం ఫెయిల్
- బీఆర్ఎస్ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరమేష్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 4(సింగిడి):** మంగపేట మండలం మల్లూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం--బూర్గంపహాడ్ ప్రధాన రహదారిపై ఈ ఆందోళన చేపట్టారు. దీంతో దాదాపు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా బాడిశ నాగరమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల ముందు 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు గడిచినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని, రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పి అరకొరగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించి కేవలం ఐదు రకాల వరి ధాన్యానికే పరిమితం చేయడం దారుణమన్నారు. యూరియా, డీఏపీ ఎరువులు సకాలంలో అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతు బీమా పథకాన్ని కూడా నిలిపివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, ఆ పథకాన్ని వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీల అమలు ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, జిల్లా నాయకులు కుర్బాన్ అలీ, పూజారి శ్రీనివాస్, కర్రి శ్యాంబాబు, సిద్దంశెట్టి లక్ష్మణ్ రావు, దంతాలపల్లి నరేందర్, గాదె శ్రీను, మూగల రమేష్, అయూబ్, కమలాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు తుక్కని శ్రీనివాస్, సోయం ఈశ్వర్, గడ్డం రాంబాబు, రూప భద్రయ్య, పండా శ్రీను, మునిగేలా సాంబయ్య, పొదెం రాంబాబు, చింతా చందర్ రావు, కొప్పుల మాణిక్యం, కొమరం పుల్లారావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల నాయకులు పబ్బోజు సత్యనారాయణ, మంచాల నాగేందర్, నిమ్మగడ్డ ప్రవీణ్, యాకన్న, సుంకోజు ప్రశాంత్, ఓదెల సుధీర్, కొమరం చంటి, మేకల పుల్లారావు, చింత గోపాల్, రఘు, చిట్టిబాబు, గోదుగు నరేష్, చంద్రకాంత్, పురుషోత్తం, గుండారపు రమేష్, మండల సంతోష్, ఇందారపు రమేష్, మునిగేలా మహేష్, దామోదర్, రాంబాబు, రెహమత్, జగన్, తొలెం బాలకృష్ణ, నజ్జు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదర్శ హై స్కూల్‌లో కృష్ణాష్టమి సంబరాలు



### అలరించిన శ్రీకృష్ణ, రాధల వేషధారణలు

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 4 (సింగిడి):** మంగపేట మండలం కమలాపురం గ్రామంలోని ఆదర్శ హై స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ మొత్తం కృష్ణనామ స్మరణతో మార్మోగింది. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణుడు, రాధ వేషధారణల్లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధల వేషధారణల్లో సందడి చేయడంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ముగ్ధులయ్యారు. వేదికపై ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని విగ్రహం ముందు చిన్నారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహి ంచేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులతో కోలాటం, ఉట్టికొట్టడం వంటి సాంప్రదాయ ఆటలను నిర్వహించారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా కోలాటం ఆడుతూ, ఒకరికొకరు సహకరించుకుంటూ ఉట్టిని కొట్టేందుకు ప్రయత్నించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. భగవాన్ శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.

# వెల్లంకి శంకర్‌రావు సేవాభావం అభినందనీయం

- ప్రజల భద్రత కోసం రూ.8 లక్షలతో 40 బారికేడ్ల అందజేత
- దాత వెల్లంకి శంకర్‌రావును అభినందించిన ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**చింతపల్లి, సెప్టెంబర్ 4(సింగిడి):** ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు తన వంతు సహకారం అందించిన వెల్లంకి ఫుడ్స్ అధినేత వెల్లంకి శంకర్‌రావు సేవాభావం అభినందనీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మండలం లోని తీదేడు గేటు వద్ద ఉన్న వెల్లంకి ఫుడ్స్ వ్యవసాయ క్షేత్రంలో వెల్లంకి శంకర్‌రావు తన సొంత ఖర్చుతో 8 లక్షల రూపాయలు వ్యయం చేసి,తయారు చేయించిన 40 రోడ్డు భద్రతా బారికేడ్లను దేవరకొండ పోలీస్ శాఖకు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ బారికేడ్లను పరిశీలించి దాత వెల్లంకి శంకర్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తన సొంత నిధులను వెచ్చించి బారికేడ్లను అందించడం సమాజం పట్ల ఆయనకున్న బాధ్యతకు నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రమాదాల నివారణలో బారికేడ్ల పాత్ర ఎందుకు కీలకమని అన్నారు. హైదరాబాద్--నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై నిత్యం అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు ఉంటాయని తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఈ బారికేడ్లను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు భద్రత కోసం ప్రజలు, వాహనదారులు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, అతివేగానికి దూరంగా ఉండటం, రాత్రివేళల్లో జాగ్రత్తగా ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.

**సీసీ కెమెరాల ఏర్పాటుకు కూడా సహకరిస్తా:**

దాత వెల్లంకి శంకర్‌రావు మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కూడా సహకరిస్తానని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలను గుర్తించడంలో పోలీసులకు మరింత సహకారం లభిస్తుందని పేర్కొన్నారు. దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ రహదారులపై బారికేడ్ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ నియంత్రణ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్, దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి, కొండమల్లేపల్లి ఎస్ఐ రమేష్, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ హరి నాయక్, మాజీ ఎంపీపీ కొండూరు పవన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, చందంపేట మండల అధ్యక్షుడు దొండేటి మల్లా రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, వి.పి.ఓ విజయ్ పాల్గొన్నారు. అలాగే కిరణ్ కుమార్, చంద్రశేఖర్, కసారపు శ్రీను, గునమోని కొండల్, నర్సింహారెడ్డి, నవీన్, రామవత్ హనుమ నాయక్, భగ్గు, శివర్ల శంకర్ యాదవ్, గునమోని శ్రీనివాస్, కలగొని రాజశేఖర్, కొరివి యాదగిరి, మర్రు మీనా రావు, పల్లెటి నర్సింహ, సందే లక్ష్మయ్య, రాశిక వెంకటేష్, గునమోని అంజయ్య, తిరుపతి, బసు, శ్రీను, మధు, మహేష్, హరి, పంతు, శ్రీరాములు, శంకర్, శ్రీశైలం, రామకృష్ణ, జంగయ్య, వెంకటనర్సింహ రెడ్డి, రమేష్, ఫుల్ సింగ్ తదితర కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్‌డీఓ హరికృష్ణ ఆధ్వర్యంలో నోటీసుల పంపిణీ తనిఖీ



**భూపాలపల్లి, సెప్టెంబర్ 4 (సింగిడి):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ లో భాగంగా భూపాలపల్లి పట్టణంలో జరుగుతున్న నోటీసుల పంపిణీ ప్రక్రియను భూపాలపల్లి ఆర్‌డీఓ హరికృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని 44వ పోలింగ్ కేంద్రం పరిధిలోని రెడ్డి కాలనీలో నోటీసుల పంపిణీ తీరును పరిశీలించి, నోటీసులు అందుకున్న ఓటర్లతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించు కునేందుకు, నోటీసులలో పేర్కొన్న వివరాలకు సరిపోయే ఆధార పత్రాలను సెప్టెంబర్ 15వ తేదీలోపు సంబంధిత బూత్ లెవల్ అధికారి కి సమర్పించాలని ఆర్‌డీఓ సూచించారు. వయస్సు లేదా జనన తేదీ రుజువు కోసం బర్త్ సర్టిఫికెట్, 10వ తరగతి మెమో, పాస్‌పోర్ట్ లేదా పుట్టిన తేదీ నమోదైన ప్రభుత్వ పత్రాలను సమర్పించవచ్చు. అలాగే భారత పౌరసత్వం, పూర్వపు ఓటరు వివరాల కోసం పాత ఓటరు జాబితా వివరాలు లేదా తల్లిదండ్రులు, తాతముత్తాతల ఓటరు వివరాలను జతచేయాలి. నివాస ధ్రువీకరణ కోసం రేషన్ కార్డు, ఆధార్, పాస్‌పోర్ట్, బ్యాంక్ పాస్‌బుక్ లేదా నివాస ధృవీకరణ పత్రాలు చెల్లుబాటు అవుతాయి. పేరు, కుటుంబ సంబంధాల నిర్ధారణ కోసం తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వామి పేరు ఉన్న ప్రభుత్వ రికార్డులు, వివాహ ధృవీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుంది. అర్హులైన ఓటర్లందరూ గడువులోగా వివరాలను సరిచూసుకుని పత్రాలను అందజేయాలని ఆర్‌డీఓ కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జితేందర్, బి ఎల్ వో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలన.. కాంగ్రెస్ శ్రేణుల బైక్ ర్యాలీ

- అనంతగిరిలో భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- సంక్షేమ పథకాలతో పేదలకు అండ
- కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి





**కోదాడ, సెప్టెంబర్ 4(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అనంతగిరి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనురాగ్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ మండల కేంద్రం వరకు కొనసాగింది. కాంగ్రెస్ జెండాలతో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైకలపై ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులు, మహిళలు, యువత, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించేందుకే బైక్ ర్యాలీ నిర్వహించినట్లు మండల అధ్యక్షుడు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పార్టీ శ్రేణులు నిరంతరం పనిచేస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. బుర్ర పుల్లారెడ్డి,గునుకుల గోపాల్ రెడ్డి,చుండూరు వెంకటేశ్వరరావు,దేగ కొండయ్య,ధరావత్ కృష్ణా నాయక్, ఎమ్.కోటేశ్వం రావు, ఈదుల కృష్ణయ్య,జె.కోటేశ్వరరావు,వివిధ గ్రామాల సర్పంచ్లు,గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులను మోసం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ధ్వజం



**భూపాలపల్లి, సెప్టెంబర్ 4(సింగిడి):** ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు అనేక హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్రంగా వంచిస్తోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా 1 ఇంక్లైన్ వద్ద టీబీజీకేఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖద్వారా సమావేశానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకట రమణారెడ్డి , టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజీ రెడ్డి, బీఆర్ఎస్ , టీబీజీకేఎస్ నాయకులతో కలిసి హాజరై మాట్లాడారు. విధుల్లో ఉండి అనారోగ్యానికి గురైన కార్మికులకు మెడికల్ ఇన్వాలిడేషన్ కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆరోపించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని కూడా మెడికల్ బోర్డులు తిరస్కరించి, తిరిగి యథావిధిగా డ్యూటీలకు పంపడం వల్ల కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పాలన అవినీతికి మారుపేరుగా మారిందని, బిల్లుల చెల్లింపుల్లో పర్సెంటేజీల వ్యవస్థ నడుస్తోందని విమర్శించారు. మంత్రుల మధ్య సమన్వయం లేక, అధికారులపై నియంత్రణ కోల్పోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలను నెలల తరబడి వదిలేసి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ బీఆర్ఎస్ వేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులతో తొలగించడం నిరంకుశత్వానికి, పక్షపాత వైఖరికి నిదర్శనమన్నారు. తెలంగాణ సాధకుడు కేసీఆర్‌పై ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, కేసీఆర్ సాధించిన రాష్ట్రంలోనే రేవంత్ సీఎం కాగలిగారని గుర్తుచేశారు. వారం రోజుల పాటు సాగే 'బీఆర్ఎస్ సమరభేరి' ద్వారా కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ అనివార్యం

క్యాన్సర్ హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ, సెప్టెంబర్ 4(సింగిడి):** మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచించారు. ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో సింధు హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఎమ్మెల్యేకి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలా మంది మహిళలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమై ఖర్చులు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. స్క్రీనింగ్ లో అనుమానిత కేసులను గుర్తించి వారికి తగిన చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా తక్కువ ఖర్చులతో లభించే వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వైద్యులను సూచించారు. ఇలాంటి మరిన్ని క్యాన్సర్ హెల్త్ క్యాంపులు అన్ని మండలాల్లో నిర్వహించాలని సింధు హాస్పిటల్ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షులు పింగిలి వెంకట నరసింహ రెడ్డి, ఉపాధ్యక్షులు పోలపల్లి బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాయపురం సాంబయ్య గారు,సమ్మెట మహేందర్ గౌడ్ ,కార్యదర్శి కట్కూరి స్వామి,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలపల్లి శివ శంకర్ రెడ్డి ,సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు సమ్మెట మహేందర్ గౌడ్, మహ్మద్ రఫీ,మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్కూరి సునీల్, అన్ని గ్రామాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు,ఉపసర్పంచులు,సింధు హాస్పిటల్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ మధు నారాయణ,డాక్టర్ హనిష,మార్కెటింగ్ డైరెక్టర్లు విద్యాప్రకాశ్,విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పురుషులు, మహిళల్లో

# గుండెపోటు, ఒత్తిడి, షుగర్ ముప్పు వేరు!



ఈ రోజుల్లో చాలా మంది డయాబెటిస్‌తో బాధపడు తున్నారు. డయాబెటిస్ కేసులు రోజుకు రోజుకు పెరిగి పోతున్నాయి. ఇన్నాళ్లు మనం డయాబెటిస్ ప్రభావం స్త్రీ, పురుషులపై ఒకేలా ఉంటుందని భావించాం. అయితే, ఇది తప్పు అని కొత్త పరిశోధన నిరూపిం చింది. షుగర్ ప్రభావం పురుషులు, మహిళల్లో వేర్వే రుగా ఉంటుందని పరిశోధకులు కనుగొన్నారు. స్త్రీ, పురుషుల శారీరక, జీవసంబంధిత నిర్మాణాలు వేర్వే రుగా ఉంటాయి. దీంతో వారు ఎదుర్కొనే అనారోగ్య సమస్యల్లోనూ తేడాలు ఉంటాయి. సాధారణంగా మహిళల్లో ఊబకాయం, థైరాయిడ్, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తే.. పురుషుల్లో అధిక రక్తపోటు (హై బీపీ), డయాబెటిస్ వంటివి ఎక్కువగా ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో బ్రిటన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీ పరిశోధకులు డయాబెటిస్‌పై ఒక కీలక అధ్యయనం నిర్వహిం చారు. దీని ఫలితాలు ప్రముఖ మెడికల్ జర్నల్ 'ప్లోస్ మెడిసిన్' లో ప్రచురితమ య్యాయి. ఈ అధ్యయనం ప్రకారం డయాబెటిస్ ప్రభావం స్త్రీ, పురుషుల్లో వేర్వేరుగా ఉంటుందని తేలింది. ఈ అధ్యయనం ఎలా నిర్వహించారు. మహిళలపైఎలాంటి పభావంఉంటుంది, పురుషుల్లో చూపించే ఎఫెక్ట్స్ ఏంటో తెలుసుకుందాం.

**అధ్యయనం ఎలా సాగింది?**

2010 నుంచి 2020 మధ్య టైప్-2 డయాబెటిస్ బారిన పడిన దాదాపు 28,720 మంది స్త్రీ, పురుషుల ఆరోగ్య రికార్డుల్ని పరిశోధకులు విశ్లేషించారు. ?ముఖ్య పరిశీలన: డయాబెటిస్ నిర్ధారణ అయిన తర్వాత దాదాపు 39 శాతం మంది తీవ్రమైన ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొన్నారు. అయితే ఆ సమస్యలు ముదిరే తీరు, వచ్చే సమయం లింగభేదాన్ని బట్టి భిన్నంగా ఉంది. మహిళలు, పురుషుల్లో ఎలాంటి ప్రభావం కనిపించింది.


మహిళలు, పురుషుల్లో
ఎలాంటి ప్రభావం కనిపించింది?

**మహిళలపై ప్రభావం:**

డయాబెటిస్ వచ్చిన తర్వాత పురుషుల కంటే మహిళల్లో మానసిక ఆరోగ్య సమస్యలు (డిప్రెషన్, తీవ్రమైన ఆందోళన వంటివి) ఎక్కువగా తలెత్తుతున్నాయి. పురుషుల్లో ఇది 5.3 శాతంగా ఉండగా, మహిళల్లో 8.1 శాతంగా నమోదైంది. ఇవి క్రమంగా వారి ప్రాణాలకే ప్రమాదకరంగా మారుతున్నాయి. పురుషులపై ప్రభావం: పురుషుల్లో గుండె సంబంధిత వ్యాధులు (8.4 శాతం, మహిళల్లో ఇది 5.3 శాతం మాత్రమే), కిడ్నీల వైఫల్యం (ఎండ్-స్టేజ్ కిడ్నీ డిసీజ్), అధిక రక్తపోటు సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి.

**తేడాలు ఎందుకు వస్తాయి?**

హార్మోన్ల మార్పులు: మహిళల్లో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ వంటి హార్మోన్లు మానసిక స్థితిపై, మెటబాలిజంపై నేరుగా ప్రభావం చూపుతాయి.



డయాబెటిస్ వల్ల వచ్చే జీవక్రియ ఒత్తిడి నేరుగా మెదడు రసాయనాలపై ప్రభావం చూపి డిప్రెషన్‌కు దారితీయొచ్చు. ఫ్యాట్ డిస్ట్రిబ్యూషన్: పురుషుల్లో కొవ్వు ప్రధానంగా పొట్ట భాగంలో (ఎఱంఎవతీుశ్రీ ఖ్ఖీ) పేరుకుపోతుంది. ఇది నేరుగా గుండె, కిడ్నీలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి హైబీపీ, హార్ట్ ఎటాక్ ముప్పును పెంచుతుంది. సామాజిక, కుటుంబ బాధ్యతలు: మహిళలు కుటుంబం, బాధ్యతల మధ్య తమ ఆరోగ్యాన్ని, ఆహారాన్ని తరచూ నిర్లక్ష్యం చేయడం వల్ల అంతర్గత ఒత్తిడి మరింత ఎక్కువవుతుంది. డయాబెటిస్ వల్ల మహిళల్లో వచ్చే ఇతర ముప్పులు

**గుండె జబ్బుల వేగం:**

సాధారణంగా రుతుక్రమం ఆగే వరకు (ీవఅశీజూఖబంవ) మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్ గుండెకు రక్షణగా ఉంటుంది. అయితే డయాబెటిస్ వచ్చినప్పుడు ఈ రక్షణ కోల్పోయి, పురుషుల కంటే చాలా వేగంగా గుండె జబ్బుల బారిన పడే ప్రమాదం పెరుగుతుంది. హార్మోన్ల అసమతుల్యత (ూజూూ): పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (ూజూూ) ఉన్న మహిళల్లో ఇన్సులిన్ రెసిస్టెన్స్ సహజంగానే ఎక్కువ. దీనివల్ల డయాబెటిస్ మరింత త్వరగా వస్తుంది, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం కష్టమవుతుంది. యూరినరీ ఇన్ఫెక్షన్లు రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు మహిళల్లో మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, ఈస్ట్ ఇన్ఫెక్షన్లు తరచూ వస్తాయి.

**లైంగిక సమస్యలు:**

డయాబెటిస్ రక్తనాళాలు, నరాల్ని బలహీనపరుస్తుంది. దీనివల్ల పురుషుల్లో అంగస్తంభన లోపాలు, లైంగిక సమస్యలు చాలా సాధారణంగా తలెత్తుతాయి. చాలామంది దీనిని బయటకు చెప్పుకోకపోవడం వల్ల మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుంది. వయసుతో పాటు పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గడం, దానికి డయాబెటిస్ తోడవడం వల్ల కండరాల బలం వేగంగా తగ్గుతుంది.

**పాదాల పూతల ప్రమాదం:**

డయాబెటిక్ న్యూరోపతి (నరాల బలహీనత) వల్ల పాదాల్లో స్పర్శ తగ్గడం, ఫలితంగా చిన్న గాయాలైనా అవి మానక పెద్ద పూతలుగా మారి గ్యాంగ్రీన్ వచ్చే ప్రమాదం పురుషుల్లో ఎక్కువ.

అతివ
Athiva

శనివారం
5-9-2026

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

మహిళల కోసం: షుగర్ లెవెల్స్ చూసుకోవడంతో పాటు నిద్రలేమి, తీవ్రమైన అలసట, చిరాకు లేదా నిరాశ వంటి లక్షణాలు కనిపిస్తే మానసిక నిపుణుల్ని సంప్రదించాలి. యోగా, ధ్యానం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలి. పురుషుల కోసం: రక్తంలో చక్కెర స్థాయిలతో పాటు తరచూ బీపీ, లిపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్), సీరం క్రియాటినిన్ (కిడ్నీ పనితీరు) పరీక్షలు చేయించుకోవాలి. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లను పూర్తిగా నియంత్రించుకోవాలి. సాధారణ నియమం: లింగభేదంతో సంబంధం లేకుండా డయాబెటిస్ ఉన్నవారు ప్రతి 3 నుంచి 6 నెలలకు ఒకసారి నపాూ1ఎ పరీక్ష చేయించుకుంటూ వైద్యుల సలహా మేరకు సరైన ఆహారం, వ్యాయామం పాటించడం అవసరం.

## కర్ణాటక నుంచి ఏపీ వరకు..

# ఆ రాష్ట్రాలపైనా అదానీ ఫోకస్..

**అదానీ గ్రూప్ ఇటీవలి కాలంలో బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. రోడ్లు, పోర్టులు, విద్యుత్, సిమెంట్, రెనివబుల్ ఎనర్జీ, డేటా సెంటర్లకు సంబంధించి దాదాపు రూ. 5 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులపై అదానీ గ్రూప్ పనిచేస్తోంది. ముఖ్యంగా కేరళ, బిహార్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, వంటి రాష్ట్రాల్లో పెట్టుబడులు కీలకంగా మారుతున్నాయి.**

**భారతదేశంలో దిగ్గజ అదానీ గ్రూప్ తన వ్యాపారాల్ని మరింత వేగంగా విస్తరిస్తూ ముందుకెళ్తోంది. ముఖ్యంగా బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా ప్రాజెక్టులను చేపడుతోంది. సిమెంట్, డేటా సెంటర్లు, రోడ్లు, పోర్టులు, పవర్ వంటి విభాగాల్లో మొత్తం దాదాపు రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలతో అదానీ గ్రూప్ ముందుకెళ్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు, ఉద్యోగాల కల్పన, ఆర్థిక వృద్ధి కోసం ప్రైవేట్ పెట్టుబడుల్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో అదానీ గ్రూప్‌కు పలు రాష్ట్రాల్లో కొత్త కొత్త అవకాశాలు లభిస్తున్నాయి.**



**కర్ణాటకలో రూ. 22267 కోట్ల టన్నెల్ రోడ్ బిడ్**

కర్ణాటకలోని బెంగళూరులో ప్రతిపాదించిన 16.75 కిలోమీటర్ల నార్త్- సౌత్ టన్నెల్ రోడ్ ప్రాజెక్టుపై అదానీ గ్రూప్ ప్రధానంగా దృష్టి సారించింది. హెబ్బాళ్ నుంచి సెంట్రల్ సిల్క్ బోర్డు వరకు ఈ టన్నెల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2 ప్యాకేజీలకు అత్యల్ప బిడ్ వేసినట్లు సమాచారం. కంపెనీ కోట్ చేసిన మొత్తం విలువ రూ. 22,267 కోట్లు. రెండో అత్యల్ప బిడ్ కంటే ఇది సుమారు రూ. 3500 కోట్లు తక్కువగా ఉందని సమాచారం. అయితే ఈ కాంట్రాక్ట్ ఇంకా ఖరారు కాలేదు. ప్రభుత్వ అంచనా కంటే ప్రాజెక్ట్ వ్యయం ఎక్కువగా ఉండటంతో కర్ణాటక ప్రభుత్వానికి ఇది కీలకంగా మారనుంది. ఇక కర్ణాటకలో ఇప్పటికే అదానీ గ్రూప్‌కు గణనీయమైన వ్యాపారాలు ఉన్నాయి. 1200 వీష ఉడుపి పవర్ ప్లాంట్, మంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ వంటి ఆస్తులు గ్రూప్ పరిధిలో ఉన్నాయి.

**కేరళలో రూ. 30 వేల కోట్ల పెట్టుబడులు!**

అదానీ గ్రూప్‌కు కేరళలో కూడా విస్తృతంగా పెట్టుబడులు ఉన్నాయి. పెద్ద స్థాయిలో ప్రాజెక్టులు ఉన్నాయి. అదానీ పోర్ట్స్ అభివృద్ధి చేసిన విజింజం ఇంటర్నేషనల్ సీపోర్ట్ దేశంలోనే కీలక డీప్- వాటర్ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టుల్లో ఒకటిగా ఎదుగుతోంది. ఈ ప్రాజెక్టు గత రాణఖీ ప్రభుత్వ హయాంలో ప్రారంభం కాగా, ప్రస్తుత కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వ కాలంలో కూడా కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరిలో విజింజం పోర్టు సెకండ్ ఫేజ్ ప్రారంభించడానికి అదానీ గ్రూప్ మరో రూ. 16 వేల కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. దీంతో ప్రాజెక్టులో అదానీ గ్రూప్ మొత్తం పెట్టుబడి విలువ రూ. 30 వేల కోట్లకు చేరుతుంది. ఇదే సమయంలో తిరువనంతపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును కూడా అదానీ గ్రూప్ నిర్వహిస్తోంది. కొచ్చిలో రూ. 600 కోట్లకుపైగా పెట్టుబడితో లాజిస్టిక్స్ పార్కును డెవలప్ చేస్తోంది.

**తెలంగాణలో రూ. 12400 కోట్ల విలువైన ప్రాజెక్టులు**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 2024 జనవరిలో అదానీ గ్రూప్ సంస్థలతో 4 అవగాహన ఒప్పందాలు (వీశీఖ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల కింద సుమారు రూ. 12400 కోట్ల మేర పెట్టుబడుల్ని ప్రతిపాదించారు. డిఫెన్స్ తయారీ, డేటా సెంటర్లు, ఎనర్జీ స్టోరేజ్ సహా ఇతర వ్యాపార రంగాల్లో ఈ పెట్టుబడులు ఉండనున్నాయి.

**తమిళనాడులో రూ. 42700 కోట్లకుపైగా పెట్టుబడి ప్రణాళిక!**

గత డీఎంకే పాలనలో తమిళనాడులో అదానీ గ్రూప్ భారీగానే పెట్టుబడుల్ని ప్రతిపాదించింది. 2024లో గ్రూప్ ప్రకటించిన వీశీఖ ల విలువ సుమారు రూ. 42700 కోట్లకుపైనే ఉంటుంది. వీటికి తోడు ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రాలైన బిహార్‌లో రూ. 50-60 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని గ్రూప్ ప్రకటించింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డేటా సెంటర్లు, రెనివబుల్ ఎనర్జీ రంగాలపై ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది. వైజాగ్‌లో గూగుల్ ఏర్పాటు చేస్తున్న భారీ ఏఐ హబ్ ప్రాజెక్టులో అదానీకానెక్స్, ఎయిర్‌టెల్ మౌలిక సదుపాయాల భాగస్వాములుగా ఉన్నాయి. ఇప్పటికే ఏపీలో అదానీ గ్రూప్‌కు కృష్ణపట్నం పోర్టుతో పాటు రెనివబుల్ ఎనర్జీ, పవర్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు ఉన్నాయి.

స్టాక్ మార్కెట్
Stock Market

## షాకిచ్చిన బంగారం ధరలు..

# ఒక్కరోజే రూ.3330 జంప్




పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో బంగారం ధరలు వరుసగా దిగివచ్చి సడెన్‌గా పెరిగాయి. వరుసగా 4 రోజులు తగ్గిన పసిడి రేట్లు ఈరోజు పెరిగాయి. వెండి రేటు ఈరోజు రూ. 5000 మేర పెరిగింది. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో ధరలు మళ్లీ పెరిగినట్లు బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 3 వ తేదీన హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో బంగారం, వెండి రేట్లు తెలుసుకుందాం.

బంగారం కొనుగోలు చేసే వారికి సడెన్ షాక్ తగిలింది. శ్రావణ మాసం, పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్న క్రమంలో పసిడి రేట్లు వరుస సెషన్లలో తగ్గడంతో భారీ ఊరట లభించింది. నాలుగు రోజుల్లో తులం రేటు రూ. 9000పైన తగ్గిన సంగతి తెలిసిందే. అయితే సెప్టెంబర్ 3వ తేదీన పసిడి రేట్లు ఒక్కసారిగా పెరిగాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా మళ్లీ దాడులు చేస్తుండడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగాయి. దీంతో బంగారం, వెండి వంటి విలువైన లోహాలకు డిమాండ్ తగ్గి ధరలు వచ్చాయి.

**హైదరాబాద్‌లో బంగారం, వెండి రేట్లు**

పసిడి ప్రియులకు ఊహించని షాక్ తగిలింది. వరుసగా 4సెషన్లలో రూ. 9 వేల పైన తగ్గిన బంగారం ధరలు సడెన్ షాకిచ్చాయి. సెప్టెంబర్ 3వ తేదీన గోల్డ్ రేట్లు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల బంగారం రేటు రూ. 3330 మేర పెరిగింది. దీంతో తులం రేటు రూ. 1,55,350 వద్దకు దూసుకెళ్లింది. అలాగే 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 3050 పెరిగి రూ. 1,42, 400 వద్దకు చేరింది. ఇక కిలో వెండి ధర రూ. 5000 పెరగడంతో రూ. 2,55,000 వద్దకు చేరింది.

**విజయవాడ, విశాఖలో గోల్డ్ రేట్లు**

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం బులియన్ మార్కెట్లలోనూ బంగారం ధరలు వరుసగా తగ్గి ఇవాళ పెరిగాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఈరోజు రూ. 3330 పెరగంతో తులం రేటు రూ. 1,55,350 వద్దకు పెరిగింది. అలాగే 22 క్యారెట్ల నగల బంగారం రేటు రూ. 3050 పెరిగి రూ. 1,42,400 వద్దకు దూసుకెళ్లింది. ఈ నగరాల్లోనూ కిలో వెండి రేటు రూ. 5000 పెరిగి రూ. 2.55 లక్షల వద్ద అమ్ముడవుతోంది.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
5-9-2026

## వైఎస్ వర్ధంతి సందర్భంగా నివాళులు


**తండ్రితో అనుబంధం తలచుకుంటూ జగన్ భావోద్వేగ పోస్ట్**



**అమరావతి, (సింగిడి):** డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా.. తెలుగు రాష్ట్రాల్లో ఆయన అభిమానులు, పలువురు నేతలు ఆయన్ని స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఓ భావోద్వేగ సందేశాన్ని పోస్టు చేశారు. 'మిస్ యు ఆల్వేస్, డాడ్! యు విల్ ఫరెవర్ బీ మై ఇన్‌స్పిరేషన్' అంటూ తండ్రిని తలచుకున్నారు. వైఎస్సార్ తనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని జగన్ పేర్కొన్నారు. తండ్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. ఆయన జ్ఞాపకాలను స్మరించారు. అంతకు ముందు.. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో, పార్టీ కేడర్‌తో కలిసి నివాళులర్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన వ్యక్తి దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన ఆయన.. ప్రజల మనసుల్లో వైఎస్సార్‌ను చిరస్థాయిగా నిల బెట్టింది. అయితే 2009 సెప్టెంబర్ 2న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన కన్నుమూశారు. ఆయన మృతికి నేటితో పదహేడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌ను స్మరించు కుంటూ తెలుగు రాష్ట్రాల్లో నివాళులర్పిస్తున్నారు. ఇటు వైఎస్సార్ వారసుడిగా రాజకీ యాల్లోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆయన అడుగుజాడల్లోనే సంక్షేమానికి పెద్దపీట వేశారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ఏపీకి ముఖ్యమంత్రిగా పేదలు, మహిళ లు, రైతులు, విద్యార్థులు, వివిధ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు.

# నదుల అనుసంధానమే అంతిమ లక్ష్యం

**ప్రతి ఎకరాకు నీళ్లిచ్చి**
**తెలుగుతల్లి రుణం తీర్చుకుంటా**
**ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**



**అనకాపల్లి, (సింగిడి):** ఏపీలో అన్ని నదులను అనుసంధానం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చి తెలుగుతల్లి రుణం తీర్చుకుంటా మని పేర్కొన్నారు. బుధవారం ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసిన సీఎం జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఉత్తరాంధ్రకు గోదారి మ్మను తీసుకువచ్చా మని తెలిపారు. నదులు, వాగులు, వంకలు దాటుకుని గోదా రమ్మ వచ్చిందని ప్రస్తావించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా కృష్ణమ్మను తరలించి.. కరువు పీడిత మార్కాపురానికి నీళ్లిచ్చా మని ఉద్ఘాటించారు. నల్లమల కొండలను చీల్చుకుని కృష్ణమ్మ వచ్చిందని అన్నారు. ఎన్నో సమస్యలను అధిగ మించి గోదావరి జలాలు తీసుకువచ్చామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం రూ. 4 వేల కోట్ల ఖర్చు చేశామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం సుభిక్షంగా మారేలా చేస్తామని తెలిపారు. ఈ జల విజయం.. ప్రజల విజయమని చెప్పుకొచ్చారు. ఆధునిక దేవాలయాలు.. సాగునీటి ప్రాజెక్టులు అని అభివర్ణించారు. నీరు ఉంటేనే భద్రత, భవిష్యత్తుపై ఓ భరోసా కల్పిస్తుందని తెలిపారు. నీరు ఉంటేనే పరిశ్రమలు.. తద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయని వివరించారు. 2014లో తాము అధికారంలోకి వచ్చాక పోలవరంపై దృష్టిపెట్టామని అన్నారు. 2019 నాటికి 72 శాతం పోలవరం పనులు పూర్తిచేశామని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం.. పోలవరాన్ని పర్యవేక్షించేలా మార్చామని వెల్లడించారు. 2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చిందని.. పోలవరానికి శాపమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ధ్వజమెత్తారు. పోలవరం నిర్వాసితులకు గొడ్డలి పార్టీ పైసా కూడా ఇవ్వలేదని సీఎం చంద్రబాబు ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పోలవరానికి శాపవిముక్తి కలిగించిందని వ్యాఖ్యానించారు. 2028 నాటికి మొత్తం 12 ప్రాజెక్టు లు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయని ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు తీసుకువస్తున్నామని వివరించారు. ఉత్తరాంధ్రకు కంపెనీలు వస్తుం టే.. గొడ్డలి పార్టీకి అసూయగా ఉందని దుయ్యబట్టారు. భవిష్యత్తులో ఉత్త రాంధ్రకే వలసలు వస్తారని అన్నారు. ఇకపై ఉత్తరాంధ్ర.. ఉత్తమ ఆంధ్రగా మారుతుందని నొక్కిచెప్పారు. పారిశ్రామికంగా అనకాపల్లి అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా అభివృద్ధి చేస్తామని అభిప్రాయపడ్డారు. వైఎస్సీపీ హయాంలో ఉత్తరాంధ్ర వణికిపోయిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకాలేనని సీఎం చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు చేయ లేదు.. కానీ ఆ నాయకుడి విలాసాలకు రుషికొండపై రూ. 500 కోట్లతో భవనం కట్టారని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు అంటూ మాయమాటలు చెప్పారని ఆగ్రహించారు. ఇప్పుడు మాయిగన్ అంటూ ప్రజలను మభ్య పెడు తున్నారని మండిపడ్డారు. విధ్వంసం చేసి ఎదైనా వైఎస్సీపీ విధానమని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అన్నింట్లోనూ క్రెడిట్ చోరీకి యత్నిస్తోందని ధ్వజమెత్తారు. తాము పోలవరం పూర్తిచేస్తే.. తామే కట్టామంటారేమో? అని వ్యంగ్యంగా మాట్లాడారు. అమరావతి నిర్మాణం పూర్తయి తే.. తమ ఘనతే అంటారేమో? అని ఎద్దేవా చేశారు. వైఎస్సీపీ ఫేక్ రాజకీయం అలాగే ఉంటుందని సీఎం చంద్రబాబు సెటైర్లు గుప్పించారు.

## టిటిడి డిప్యూటి ఇవో లోకనాథం నివాసంలో ఎసిబి సోదాలు

**భారీగా ఆభరణాలు స్వాధీనం చేసుకున్న ఎసిబి**

**తిరుపతి, (సింగిడి):** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో మెండు లోకనాథం నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి తిరుపతి పెద్దకాపు లేఔట్‌లోని లోకనాథం ఇంటితో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి 7 బృందాలుగా ఏర్పడిన అధికారులు తనిఖీలు చేస్తున్నారు. తిరుపతిలో లోకనాథంకు సంబంధించిన వసతిగృహంతో పాటు, తిరుపతి లోని లోకనాథం ఇద్దరు బావమరుదుల ఇళ్లతో పాటు, ఏర్పేడు మండలం చెల్లూరులోని అతని సోదరుడి నివాసంలో కూడా తనిఖీలు చేస్తున్నారు. తిరుపతి ఎస్వీ నగర్ ఎస్‌బీఐ బ్రాంచ్ లాకర్లను పరిశీలిస్తున్నారు. ఏసీబీ దాడుల సమయంలో లోకనాథం ఇంట్లోనే ఉన్నారు. తనిఖీల్లో.. రూ. కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, స్థిర, చరాస్తులు గుర్తించినట్లు సమాచారం. 2011లో తితిదే డిప్యూటీ ఈవో భూపతిరెడ్డి నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. దాదాపు 15 ఏళ్ల తర్వాత తితిదే ఉద్యోగి నివాసంలో తనిఖీలు చేయడం ఇదే తొలిసారి.

## గొల్లగుప్పలో మలేరియాతో బాలిక మృతి

**గ్రామస్థులందరికీ ఆరోగ్య పరీక్షలు చేండి**
**అధికారులకు డిప్యూటి సిఎం పవన్ ఆదేశం**



**అమరావతి, (సింగిడి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్ల గుప్పలోని గ్రామస్తులందరికీ తక్షణం వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారు లను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. గ్రామస్తులకు పంపిణీ చేసిన మలేరియా మందులను ల్యాబ్‌కు పంపాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫోన్ చేసి.. బాలిక (7) మృతి ఘటనపై ఆరా తీశారు. అలాగే ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెండో తరగతి చదువుతున్న బాలిక మృతిపై ఆయన విచారం వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ప్రత్యేక వైద్య బృందంతో పర్యవేక్షణ కొనసాగు తోందని డిప్యూటీ సీఎంకు జిల్లా కలెక్టర్ వివరించారు. మలేరియా నివారణ కోసం మాత్రలు తీసుకున్న 53 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో పలువురు అనారోగ్యం బారిన పడ్డారు. దీంతో తెలంగాణలోని భద్రాచలంతో పాటు లక్ష్మీపురంలో వారంతా చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వ హించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అలాగే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. గొల్లగుప్పలో 74 మందికి మలేరియా నివారణ కోసం క్లోరోక్విన్ ట్యా-లబెట్లు పంపిణీ చేశారు. వీటి వల్ల పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఈ ట్యా-లబెట్ వికటించి.. విద్యార్థి జమున (7) మృతి చెందిన సంగతి తెలిసిందే.

## పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరు

**ఏరియల్ వ్యూ ద్వారా పోలవరం ఎడమ కాల్వ పరిశీలన**
**జలహారతి ఇచ్చి, నీరు విడుదల చేసిన చంద్రబాబు**



**అనకాపల్లి, (సింగిడి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు బుధవారం అనకాపల్లి జిల్లాలోని పాయకరావు పేటలో పర్యటిం చారు. ఏరియల్ వ్యూ ద్వారా పోలవరం ఎడమ కాల్వను పరిశీలించి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసి జలహారతి ఇచ్చారు. ముఖ్య మంత్రికి సంప్రదాయ కోలాటంతో స్వాగతం పలికారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు నీరు ఇస్తున్నందుకు సూచికగా పాయకరావు పేట వద్ద శిలా ఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శిలాఫలకం వద్ద సీఎం చంద్రబాబు ఫొటో లు దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఎడమ కాలువ నుంచి అనకాపల్లి జిల్లా వరకూ వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేశారు. పాయకరావు పేట వద్ద పోలవరం ఎడమ కాలువ క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఎడమ కాల్వ ద్వారా వదిలే నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళిక రచించింది.

## బిసి హాస్టళ్లలో నాణ్యమైన విద్య

**విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం : మంత్రి సవిత వెల్లడి**

**విజయవాడ, (సింగిడి):** బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో నాణ్య మైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తు న్నామని ఏపీ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. ఆయా హాస్టళ్లు, గురుకు లాలు, వాటి పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. విజయవాడలోని గుణదల బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో శానిటరీ కిట్లను మంత్రి సవిత బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లిఖార్జున, ఇతర బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మంత్రి సవిత మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థి నుల వినతి మేరకు గుణదల హాస్టల్ లో గ్రంథాలయం ఏర్పాటుకు హామి ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు. బీసీ హాస్టళ్లలో 1,200 మంది పారి శుధ్య సిబ్బందిని నియమించామని మంత్రి సవిత వెల్లడించారు. ఏపీవ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లకు రూ. 6 కోట్ల విలువైన శానిటరీ కిట్లు అందజేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఒక్కో కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంటాయని వివరించారు. ఇప్పటికే బీసీ హాస్టళ్లు, గురుకులా ల్లో దోమ తెరలు ఏర్పాటు చేశామని అన్నారు. ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల రక్షణకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మెనూ సక్రమంగా అమలు చేసేలా 142 మంది కుక్‌లు, కమాటీలను నియ మించామని తెలిపారు. ఇంటిని మైమరిపించేలా హాస్టళ్లు, గురుకులాల్లో వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. వచ్చే పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ఈ ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని అన్నారు. బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్యా, వసతి అందిస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు.

## ఐదు దశాబ్దాల కల నెరవేరింది

**చంద్రబాబు సంకల్పంతోనే**
**ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు**
**రాష్ట్ర హోం శాఖ మంత్రి, ఎమ్మెల్యే**
**వంగలపూడి అనిత**



**అనకాపల్లి, (సింగిడి):** ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఈ ప్రాంతానికి చేరాయి. ఈ చారిత్రక ఘట్టంపై రాష్ట్ర హోం శాఖ మంత్రి, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పం, అవిశ్రాంత కృషి వల్లే సాధ్యమైందని కొనియాడారు. "నీరు ఉన్నచోటే జీవం, ప్రగతి, అభివృద్ధి ఉంటాయి. ఐదు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న కలను నిజం చేసిన మహానీయుడు చంద్ర బాబు" అని ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అనిత మాట్లాడుతూ.. "పోలవరం కేవలం ఒక ప్రాజెక్టు కాదు, అదొక జీవనాడి, ఒక ఎమోషన్. మన చిన్నతనం నుంచి వింటున్న పోలవరం ఈరోజు కళ్లముందు సాకారం కావడం చంద్రబాబు దయవల్లే సాధ్యమైంది. ఆలోచనలు ఎవరికైనా వస్తాయి, కానీ వాటిని కార్యరూపంలో పెట్టే దృఢ సంకల్పం, పట్టుదల, దైవానుగ్రహం అన్నీ కలిస్తే ఆరు అడుగుల రూపంలో మన ముందున్న చంద్రబాబు గారు" అని అన్నారు. ఈ బృహత్కార్యంలో చంద్రబాబుకు రాముడి వెంట హనుమం తుడిలా సహకరిస్తున్నారంటూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా రు. గత ఐదేళ్ల పాలనపై అనిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2014-19 మధ్య చంద్రబాబు పోలవరం పనులను 72% పూర్తి చేస్తే, ఆ తర్వాత వచ్చిన గొడ్డలిపాటి నేతలు రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును నాశనం చేశారు. ఐదేళ్లలో కనీసం 2% పనులు కూడా చేయకుండా ఆటం కాలు సృష్టించారు. ప్రాజెక్టు ఐదేళ్లు ఆలస్యం కావడం అంటే ఒక రైతు జీవితంలో ఐదేళ్ల నిరీక్షణ, ఒక ప్రాంత అభివృ ద్ధిలో ఐదేళ్ల వెనకడుగు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి నీటిపారు దల శాఖ మంత్రి అసెంబ్లీలో "పోలవరం ఎవరి చేతిలో ప్రారంభం కావాలో రాసి పెట్టి ఉందో, ఆయనే పూర్తి చేస్తారు" అని చెప్పిన మాటలను ఆమె గుర్తుచేశారు. ఆ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరిందని పేర్కొన్నారు. చంద్రబాబును 'అపర భగీరథు డు'గా అభివర్ణించిన అనిత, "పురాణాల్లో భగీరథుడు గంగ కోసం ఘోర తపస్సు చేశాడు. కానీ మనం గోదారమ్మ తల్లిని ఉత్తరాంధ్రకు తీసుకురావడానికి చంద్రబాబుకు ఒకే ఒక్క ఓటు వేశాం. ఆ ఒక్క ఓటుతోనే నాసిక్‌లో పుట్టిన గోదావరి 180 కిలో మీటర్లు ప్రయాణించి మన పొలాల దాకా వచ్చింది" అని అన్నా రు. గతంలో వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న పాయకరా వుపేట, నేడు ఆర్సెలర్ మిట్టల్ వంటి పరిశ్రమలతో పారిశ్రామి క, వ్యవసాయ ముఖద్వారంగా మారిందని తెలిపారు. "ఒకే ఒక్క ఓటు గోదారమ్మను, ఆర్సెలర్ మిట్టల్‌ను, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను, పరిశ్రమలను తీసుకొచ్చింది. సరైన వ్యక్తికి సరైన సమయంలో ఓటు వేస్తే ఇంత అభివృద్ధి జరుగుతున్నప్పుడు, మాకు మరో వ్యక్తికి ఓటేయాలన్న ఆలోచన కూడా రాదు. మీరే మా ముఖ్యమంత్రి, మీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం" అని అనిత ధీమా వ్యక్తం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో ఉనికి కోసం ఆరాటం

**జగన్‌పై మంత్రి**
**బిసి జనార్ధన్ రెడ్డి విమర్శలు**



**కర్నూలు, (సింగిడి):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కోసం గొడ్డలి పార్టీ ఆరాట పడుతోందని విమర్శించారు. వైసీపీ ఏ రోజు ప్రజల సమస్యలపై ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. బుధవారం కర్నూలు జిల్లాల్లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనతో ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ప్రజా సంక్షేమం కోసం ఏమి చేశారో చెప్పే దమ్ము ఉందా అని బీసీ జనార్ధన్ రెడ్డి నిలదీశారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో పట్టిసీమను పూర్తి చేసి ఆదుకున్నారని తెలిపారు. పులివెందులకు కూడా నీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుదని చెప్పుకొచ్చారు. 36 నీటి ప్రాధాన్య ప్రాజెక్టులకు నీరు ఇస్తున్నామని వెల్లడించారు. ఏపీలో డ్రిప్ ఇరిగేషన్ లేకుండా చేసింది జగన్ మోహన్ రెడ్డినే అని విమర్శించారు. వైసీపీ నేతలు దొంగ దీక్షలు, ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి అన్నారు. ప్రజలకు, రైతులకు ఏ విధంగా నీరు ఇవ్వాలో అధికారులతో తాము సమీక్షలు చేస్తున్నామని తెలిపారు. తలకిందులు చేసిన కూడా గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. కేసీ కెనాల్‌కు నీరు ఎప్పుడు విడుదల చేస్తామో త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. వైసీపీ లాగా సెట్టింగ్‌లు వేసి తాము డ్రామాలు చేయమని బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు.

## జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్



**అమరావతి, (సింగిడి):** రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటన లో భాగంగా నరసరావు పేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ. 70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి. సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస‌ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## చంద్రబాబు విజన్ తో ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

**రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



**అనకాపల్లి, (సింగిడి):** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ గోదావరి జలాలు ఈ ప్రాంతాన్ని తాకాయని, ఇది ముఖ్యమంత్రి, అపర భగీరథుడు చంద్రబాబు దార్శనికత వల్లే సాధ్యమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు చేరడం రాష్ట్ర జలవనరుల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని ఆయన అభివర్ణించారు. బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావు పేట వద్ద సీఎం చంద్రబాబు గోదావరి జలాలకు హారతి పట్టడం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నిమ్మల రామానా యు డు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాకముందే, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఉత్తరాంధ్రకు నీరందించాలన్న చంద్రబాబు ముందు చూపు వల్లే ఈరోజు ఈ ప్రాంత ప్రజల దాహం తీరుతోందని మంత్రి అన్నారు. "2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, 2026 నాటికి లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం గడువులోగా పూర్తి చేసి ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ రెండేళ్ల కాలంలోనే ఏలేరు, పంప, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను, తొమ్మిది జాతీ య రహదారులను దాటుతూ కెనాల్ నిర్మాణంలో ఉన్న క్లిష్టమైన పనులను పూర్తి చేశామని తెలిపారు. కొమ్మరిలోవ వద్ద 100 మీటర్ల లోతైన కొండను తవ్వి కాలువను తీసుకురా వడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నిమ్మల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంచి చేసే కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రాన్ని ముంచేసిన "గొడ్డలి పార్టీ"కి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరుతూ మూడు కీలక విషయాలను ప్రస్తావించారు. "మొదటిది, గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కనీసం ఒక్క తట్ట మట్టి పని చేయలేదు, అరబస్తా సిమెంట్ వాడలేదు, ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. అలాంటి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే హక్కు లేదు" అని ఆరోపించారు. "రెండోది, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీలో పట్టిసీమను 'వట్టిసీమ' అని, పురుషోత్తపట్నం పనికిరాదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ఆ పంపులను పీకేస్తానని హెచ్చరించారు. కానీ ఈరోజు అవే పట్టిసీమ పంపులు కృష్ణా డెల్టా ఆయకట్టును ఆదుకుంటున్నాయి. సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా 32 టీఎంసీల నీటిని అందించాం. అదేవిధంగా, ఆయన పీకేస్తానన్న పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారానే నేడు ఉత్తరాంధ్రకు నీళ్లు వస్తున్నాయి. ఇది చంద్రబాబు ముందుచూపునకు, గొడ్డలి పార్టీ విధ్వంసకర పాలనకు మధ్య ఉన్న తేడా" అని మంత్రి విమర్శించారు. "మూడవది, 2019 నాటికి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశారు. ఆయన అధికారంలో కొనసాగి ఉంటే 2021కే ప్రాజెక్ట్ పూర్తయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, డయాఫ్రం వాల్ ధ్వంసం వంటి చర్యల వల్ల ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే, ఈ సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసిన 900 టీఎంసీల వరద నీటిలో కనీసం 300 నుంచి 350 టీఎంసీలను కృష్ణా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు తరలించేవాళ్లం" అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలుగు జాతి భారీగా నష్టపోయిందని, ఈ ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర ప్రజలు తరిమి తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## చంద్రబాబు అపర భగీరథుడు

**ఏపీ సస్యశ్యామలం కాబోతోంది**
**స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి**

**అమరావతి, (సింగిడి):** ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారని... పోలవరం కాలువను కూడా ప్రారంభించబో తున్నారని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావ రణం నెలకొందని, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల క్యాలెండర్‌ను విడుదల చేసిందని, అందులో కేటాయించిన 36 ప్రాజెక్టుల్లో ఏకంగా 14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతానికే చెందడం సీమ పట్ల చంద్రబాబుకు ఉన్న అంకితభావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు కనీసం రూ. 2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పంకు నీళ్లిచ్చామని చెప్పి ట్యాంకర్లతో నీటిని తెచ్చి డ్రామాలు ఆడారని.. కానీ చంద్రబాబు మాత్రమే నిజంగా కుప్పంకు నీటిని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్ కూడా పూయలేని చేతకానితనంతో నాటి ప్రభుత్వం విపత్తును కొనితెచ్చిందని విమర్శించారు. టీబీ డ్యామ్ గేట్లను యుద్ధప్రాతిపదికన మార్చి నీటి నిల్వపై భరోసా కల్పించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన పట్టాభి... వారు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట వేల కోట్లు దోచుకుని, పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి, పనులు 17 నెలలు నిలిచిపోవడానికి జగనే కారణమని ఆరోపించారు. జగన్ హయాంలో 'జలయజ్ఞం' కాస్త 'ధనయజ్ఞం'గా మారిందని... అనుమతులు లేని రాయలసీమ లిఫ్ట్ పేరుతో మట్టి పనుల కింద వైసీపీ నేత పెద్దిరెడ్డికి రూ. 1,000 కోట్లు దోచిపెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు కడుపుమంటతో అల్లాడిపోతున్నారని అన్నారు.

## అనంతపురంలో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్ట్

**400 మెగావాట్ల పవన-సౌర హైబ్రిడ్ పునరుత్పాదకత**

**అమరావతి, (సింగిడి):** ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో, బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీల సంయుక్త సంస్థ అయిన ఎవ్రెన్ అభివృద్ధి చేస్తున్న 552 మెగావాట్ పీక్ యుటిలిటీ-స్కేల్ సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కాంట్రాక్టును యాక్సిస్ ఎనర్జీ దక్కించుకుంది. రాబోయే 18 నెలల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది యాక్సిస్ ఎనర్జీ యొక్క స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టుల విస్తరణలో ఒక ముఖ్యమైన భాగంగా నిలవడంతో పాటుగా ఎవ్రెన్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ సోలార్ ప్రాజెక్టు 400 మెగావాట్ల పవన-సౌర హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులో భాగంగా ఉంది. ఇందులో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ( ను అనుసంధానించి, రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ యొక్క గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తీర్చటానికి అనుగుణంగా రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్, గరిష్ట వినియోగ సమయాల్లో పునరుత్పాదక విద్యుత్‌ను అందిస్తుంది. ఇది గ్రిడ్ విశ్వసనీయతను పెంచుతూ, రాష్ట్ర స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లోని 640.5 మెగావాట్ల పవన విద్యుత్ విభాగానికి సంబంధించిన ఈపీసీ పనులను కూడా యాక్సిస్ ఎనర్జీ చేపడుతోంది, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా యాక్సిస్ ఎనర్జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీ సూరపనేని మాట్లాడుతూ, "బీబీబీ ప్రాజెక్ట్‌లోని సౌర విద్యుత్ విభాగానికి సంబంధించి ఈపీసీ కాంట్రాక్టును దక్కించుకోవడం యాక్సిస్ ఎనర్జీకి ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది ఎవ్రెన్‌తో మా దీర్ఘకాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ ప్రతిష్ఠాత్మక హైబ్రిడ్ ప్రాజెక్టులో పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏకకాలంలో అమలు చేయడం ద్వారా సమగ్ర పునరుత్పాదక ఇంధన పరిష్కారాన్ని అందించే అరుదైన అవకాశం మాకు లభించింది. అత్యుత్తమ ఇంజినీరింగ్ నైపుణ్యం, సమర్థవంతమైన కార్యకలాపాల నిర్వహణతో పాటు ప్రపంచస్థాయి ప్రాజెక్టు అమలు సామర్థ్యాలను సమన్వయం చేసి, ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నాం. విశ్వసనీయమైన, విస్తరించదగిన, సుస్థిరమైన స్వచ్ఛ ఇంధన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశ ఇంధన పరివర్తనకు మద్దతు ఇవ్వాలనే మా నిరంతర నిబద్ధతను ఈ ప్రాజెక్ట్ ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్పీడీసీఎల్)తో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) మద్దతుగా ఉన్నాయి. పవన, సౌర విద్యుత్ ఉత్పత్తితో పాటు బ్యాటరీ నిల్వ వ్యవస్థను సమగ్రంగా అనుసంధానించడం వల్ల పునరుత్పాదక విద్యుత్‌ను మరింత విశ్వసనీయంగా వినియోగించుకోవచ్చు. అలాగే, విద్యుత్ ఉత్పత్తిలో ఉండే హెచ్చుతగ్గులను నిర్వహించడంతో పాటు, గరిష్ఠ డిమాండ్ సమయంలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇది దోహదపడుతుంది.

## మంత్రి సత్యకుమార్ యాదవ్ కు బీజేపీ కీలక బాధ్యతలు

**అమరావతి, (సింగిడి):** ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ అధిష్ఠానం కీలకమైన ప్రాధాన్యాన్ని అప్పగించింది. ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆయనను నియమించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. భాగంగా బీజేపీ, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో విస్తృత ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజాసేవ, దేశాభివృద్ధి సహా 'వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా', 'నమో సేవా గాథ', 'ఆంగన్ కా ఉత్సవ', 'కహానీ బద్లావ్ కి', 'సేవా జ్యోతి యాత్ర' వంటి వినూత్న ప్రజా భాగస్వామ్య సేవలను ప్రజల ముందుకు తీసుకురానున్నారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాల సమన్వయం, అమలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలను మంత్రి సత్యకుమార్ దగ్గరుండి చూడనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జరగనున్న రాష్ట్రవ్యాప్త వర్క్‌షాప్ కు మంత్రి సత్యకుమార్ హాజరవుతున్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం


# రైతు కన్నీరు తుడిచిన మహానేత వైఎస్ఆర్

**మెరుగైన వైద్య సేవల కోసం 108 ఏర్పాటు చేసిన నేత**
**మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని**
**ఘనంగా డాక్టర్ వైయస్సార్ వర్ధంతి వేడుకలు**



**జమ్మికుంట, (సింగిడి)::** పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రైతుల కన్నీళ్లు తురుస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తూ సుస్థిర పాలన అందించిన మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని హుజురాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు అన్నారు. మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా హుజరాబాద్ లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మిఠాయిలు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి 108 అంబులెన్స్ ఏర్పాటు చేయడం ఆయన గొప్పతనమని అన్నారు. అంతేకాకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించారని రైతులకు ఉచిత విద్యుత్ ను అందించి వారికి అండగా నిలిచారని రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ మన ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులతో పాటు పలువురు నేతలు మహిళా నేతలు పాల్గొన్నారు.

# పురోహితుడి కుటుంబానికి ఎమ్మెల్యే అండ

**ప్రసాదాచార్యుల సంతాప సభలో పాడి కౌశిక్ రెడ్డి**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామా నికి చెందిన ప్రముఖ వేద పండితులు సముద్రాల ప్రసాదాచార్యులు ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న హుజురాబాద్ శాసనస భ్యులు పాడి కౌశిక్ రెడ్డి బుధవారం వారి స్వగృహానికి చేరుకొని ప్రసాదాచార్యుల చిత్రపటా నికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షణ సహాయ కింద ఆ కుటుంబానికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, జమ్మికుంట మండలం తో పాటు ఓదెల మండలం లో కూడా తన పౌరోహిత్యం తో ఎంతోమంది కుటుంబాలకు దగ్గరగా ఉన్న ప్రసాదాచార్యులు చిన్న వయసులో అనారోగ్యంతో మృతి చెందడం తనకు ఆవేదనను కలిగించిందని తన పూజలతో ఎంతోమందిని ఆకట్టుకున్నారని ఆయన ఆకస్మిక మరణం ఆ కుటుంబంతో పాటు ఈ రెండు మండలాల ప్రజలకు తీరని లోటు అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఏ సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు.

**అందరి మేలు కోరే వ్యక్తి ప్రసాదాచార్యులు**
**- కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్**

విలాసాగర్ గ్రామంలో సముద్రాల ప్రసాదాచార్యుల సంస్మరణ సభలో పాల్గొన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ మాట్లాడుతూ, సుమారు 30 సంవత్సరాలకు పైగా పౌరోహిత్యం నిర్వహిస్తూ ఎంతో మంది కుటుంబాలకు అండగా నిలిచిన ప్రసాదాచార్యులు అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం తమను కలిచి వేసిందని ఎలాంటి పూజ నైనా పవిత్రంగా చేస్తూ అందరివాడుగా పేరు తెచ్చుకున్నాడని ఆయన లోటు ఎవరు తీర్చలేనిదని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని వేడుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటానని వారి కష్టసుఖాలను పాలు పంచుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సముద్రాల కిషోరాచార్యులు తిప్పారపు శ్రీనివాస్ వజ్జపల్లి శ్రీనివాస్ రాచపల్లి వంశీ బిట్ల రాజేందర్ చిలుక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర దానం చేద్దాం మరో ఇద్దరికి చూపును ప్రసాదిద్దాం

**బూరుగుపల్లి కిరణ్ చూపు సజీవం**
**నేత్ర దాత కుటుంబాన్ని అభినందించిన సదాశాయ ఫౌండేషన్**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని పద్మ శాలి వాడకు చెందిన బూరుగుపల్లి కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కిరణ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సదాశాయ ఫౌండే షన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులను కలిసి నేత్రాలు దానం చేయాలని సూచించగా కుటుంబ సభ్యుల సహకారంతో కిరణ్ నేత్రాలను సదాశివ ఫౌండేషన్ ద్వారా ఎల్వీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి దానం చేశారు. బుధవారం కిరణ్ స్వగ్రామానికి చేరుకున్న సదాశాయ ఫౌండేషన్ సభ్యులు సంతాప సభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు మేమేంటో అందించారు. ఈ సందర్భంగా సదా శాయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి మాటా డుతూ, నేత్రదానంపై అనవసరమైన అపోహలు పడవద్దని మనం చనిపోయిన తర్వాత మన నేత్రాలను దానం చేయడం వల్ల మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన వారిమవుతామని తెలిపారు. బూరుగుపల్లి కిరణ్ మృతి చెందిన ఆయన నేత్రాలు మరో ఇద్దరి అందులకు చూపును ప్రసాదించారని కిరణ్ కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సదాశియ ఫౌండేషన్ ప్రతినిధులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు ముత్యాల జగదీశ్వర్ చతురాల శ్రీనివాస్ మంగళ రమేష్ క్యాతం రవి ఇల్లందుల సమ్మయ్య వరగంటి సదానందం బూరుగుపల్లి రాము సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న వైఎస్సార్**
**ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి**
**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**కరీంనగర్, (సింగిడి):** దివంగత మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా గా నిలిచారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అత్యవసర సేవలు, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను ఆయన ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత రంగాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా అభివృద్ధిలోనూ వైఎస్సార్ పాత్ర మరువలేనిదని, ఆయన హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, కాలువలతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం, కొండగట్టు, మంథనిలో జేఎన్‌టీయూ, కోరుట్లలో పశువైద్య విశ్వవిద్యాలయం వంటి సంస్థలు ఆయన హయాంలోనే ఏర్పాటయ్యాయని తెలిపారు. 2009లో హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్సార్ మరణించడం అత్యంత విషాదకరమని అన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న వైఎస్సార్ ఆశయాన్ని నెరవేర్చేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, మడుపు మోహన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పాలనపై మాట్లాడే నైతిక హక్కు లేదు

**పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పి**
**బీఆర్ఎస్ నేతలు ధర్నాలు చేయాలని డిమాండ్**
**సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి**




**కరీంనగర్, (సింగిడి):** పదేళ్ల పాటు ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రజాపాలనపై ధర్నాలు చేసే నైతిక హక్కు లేదని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ముకరంపురలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, దీనిని ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు ధర్నాలకు దిగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధికారిక శిబిర కార్యాలయం వద్ద కాంగ్రెస్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఫ్లెక్సీ తొలగించకపోతే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవకతవకలపై కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇచ్చారో, ఎంతమంది దళితులకు మూడు ఎకరాల భూమి అందించారో ప్రజలకు సమాధానం చెప్పాలని నరేందం రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గంగుల స్వయంగా పాల్గొంటూ లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నారని, అదే సమయంలో పథకాలు అమలు కావడం లేదని ఆయన మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఆ పార్టీ నేతలే మాట్లాడుతున్నారని పేర్కొంటూ, ప్రజలను మభ్యపెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ హద్దులు దాటి మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు. లేకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా స్పందిస్తారని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కుర్ర పోచయ్య, మామిడి సత్యనారాయణరెడ్డి, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, ముక్క భాస్కర్, తోట అంజయ్య, షబానా, గుడిపాటి రమణరెడ్డి, ఫజల్, ఖలీల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని**
**ఏర్పాట్లు పూర్తి చేయాలి: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి):** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గణేష్ నిమజ్జన స్థలాన్ని సందర్శించిన మేయర్ అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజల భద్రత, భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్‌తో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**జమ్మికుంట, (సింగిడి):** జన సేన పార్టీ అధ్యక్షులు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద జన సేన నాయకులు, అభిమానులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జన సేన పార్టీ నాయకులు రాసమల్ల శేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో కూడా జన సేన పార్టీ తన సేవలను అందించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో జన సేన పార్టీ రాజకీయ ఆరంగ్రేటం చేస్తుందని స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే శాసనసభ ఎన్నికల్లో జన సేన పార్టీ తెలంగాణలో పోటీ చేస్తుందని జన సేన పార్టీ గెలుపు కోసం ఇప్పటినుండే ప్రతి కార్యకర్త ఒక సైనికుడి వలె పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుడు ఆశీస్సులు పవన్ కళ్యాణ్ పై ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు. కార్యక్రమంలో జన సేన పార్టీ నేతలు కండెం వంశీ మంద వేణు కుమారస్వామి రాకేష్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యార్థికి అంతర్జాతీయ చెస్ రేటింగ్

**చెస్‌లో ప్రతిభ చాటిన మూడో తరగతి**
**విద్యార్థి కె. స్నితిక్‌రెడ్డికి అభినందనలు**
**అల్ఫోర్స్ విద్యాసంస్థల**
**అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందిన మూడో తరగతి విద్యార్థి కె. స్నితిక్‌రెడ్డి చెస్‌లో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్-13 జూనియర్ చెస్ చాంపియంషిప్‌లో పాల్గొని తొలిసారిగా ఈ అంతర్జాతీ య రేటింగ్‌ను సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల లో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్నితిక్‌రెడ్డిని పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందించడంతో పాటు ఒత్తిడిని తగ్గించి, ఆత్మవిశ్వా సాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపుతో పాటు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. చెస్ క్రీడ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, తార్కిక ఆలోచనా విధానం మెరుగుపడతా యని తెలిపారు. పాఠశాలలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో శిక్షణ అందిస్తూ, ప్రతిభ కనబరిచే విద్యార్థులను ఉన్నతస్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



**జమ్మికుంట, (సింగిడి):** స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఆర్‌సీ మండల విద్యాధికారి మంతెన హేమలత ఆధ్వర్యంలో పాఠశాలల క్రీడా సమైక్య (ఎస్‌జీఎఫ్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జమ్మికుంట మండల పరిధిలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ప్రేమలత తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాలలో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జమ్మికుంటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు మండల స్థాయి ఎంపిక పోటీలు టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ జరుగుతాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీన అండర్-14 మరియు అండర్-17 బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు. ఈ నెల 10వ తేదీన అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు. ఈ నెల 11వ తేదీన అండర్-14, అండర్-17 బాలబాలికలకు అథ్లెటిక్స్ విభాగంలోపోటీలు. వయోపరిమితి అర్హతలు అండర్-14 విభాగం 01-01-2013 నాటికి లేదా ఆ తర్వాత జన్మించిన వారు అర్హులు. అండర్-17 విభాగం 01-01-2010 నాటికి లేదా ఆ తర్వాత జన్మించిన వారు అర్హులు. ఈ మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు కరీంనగర్ జిల్లాలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు జమ్మికుంట పరిధిలోని పాఠశాలలు ఈ నెల 8వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అదే రోజున డ్రా తీయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు వి. శ్రీలత, జి. రేణుక, జి. శ్రీను, హఫ్సా తదితరులు పాల్గొన్నారు. పోటీలకు సంబంధించిన ఇతర వివరాలు నమోదు కోసం జమ్మికుంట మండల కన్వీనర్ వి. ప్రేమలత జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జమ్మికుంట, ఫోన్ నెంబర్ 8099690998 ను సంప్రదించగలరని కోరారు

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ భారీ నిరసన

**420 హామీలు - 420**
**ఫిట్లు' ఫ్లెక్సీతో ఆందోళన**
**కాంగ్రెస్ బాకీ కార్డుతో ప్రజల్లోకి ప్రచారం**
**ప్రజల బాకీలను వెంటనే చెల్లించాలని**
**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డిమాండ్**




**జమ్మికుంట, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తైన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా 420 హామీలు - 420 ఫిట్లుఅనే భారీ ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన తెలుపుతూ కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజలకు పంపిణీ చేస్తూ ప్రభుత్వం అమలు చేయని హామీలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు దేవాలయాల్లో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందజేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు దాదాపు వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. వచ్చే నెల100 రోజులు అంటూ ప్రజలను నమ్మించి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, రైతులకు రైతు భరోసా, రూ. 2 లక్షల రుణమాఫీ, వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్న కౌశిక్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం కొనసాగి స్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజక వర్గ వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్ రావు, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, పోల్నేని సత్యనారాయణ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ జావేద్, నైనేని తిరుపతిరావు, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్ ముసిపట్ల తిరుపతి రెడ్డి, నీల కుమారస్వామి, దాసరపు రాధాకృష్ణ, సరిగొమ్ముల వెంకటేష్, కందాల కొము రెల్లి, మర్రి శ్రీనివాస్ రెడ్డి, దంసాని కుమార్, నైనేని తిరుపతి రావు, పేరాల సంపత్ రావు, యర్రం ఇంద్రసేన రెడ్డి, మరపెల్లి నవీన్ కుమార్, లండిగె లక్ష్మణ్ రావు, తక్కల్ల పల్లి సత్యనారాయణ రావు, ఏడవెల్లి కొండల్ రెడ్డి, పోల్సాని రామారావు, సంగెం ఇలయ్య, దొడ్డె మమత, పోల్సాని మనోహర్ రావు, పోల్సాని తిరుపతి రావు, పమ్మిడి లింగారావు, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, కడవెరుగు మోహన్, పోల్సాని సమ్మా రావు, కన పర్తి లింగారావు, మడికొండ సురేందర్ రావు, తోట లక్ష్మణ్, గందే శ్రీనివాస్, వర్దినేని రవీందర్ రావు, కొలిపాక శ్రీనివాస్, ప్రతాప తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 1.11 కిలోల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

**మరో నిందితుడి కోసం కరీంనగర్**
**రూరల్ పోలీసుల గాలింపు**
**రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్**
**అనుముల నిరంజన్‌రెడ్డి**




**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామ శివారు లోని సమ్మక్క గద్దెల సమీపంలో 1 కిలో 11 గ్రాముల గంజాయిని కరీంనగర్ రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకుని పరారవడంతో అతని కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసుల వివరాల ప్రకారం. విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అనుముల నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ ఏ. లక్ష్మారెడ్డి, సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్, బ్యాగుతో అనుమా నాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించగా, బెజ్జంకి ప్రేమ్‌కుమార్ (28)ను పోలీసులు పట్టుకున్నారు. మరో వ్యక్తి కాశిపాక నవీన్ (23) పరారయ్యాడు. ప్రేమ్ కుమార్‌ను విచారించగా నవీన్ గంజాయిని తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పరిసర గ్రామాల్లో విక్రయించేవాడని, ఈ క్రమంలో ఇద్దరూ కలిసి గంజాయి విక్రయానికి సిద్ధమవుతుండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. పంచుల సమక్షంలో బ్యాగును తనిఖీ చేయగా 1.11 కిలోల గంజాయి లభించిందని, గంజాయితో పాటు ఒక ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ అనంతరం న్యాయ స్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిం చారు. పరారీలో ఉన్న నవీన్‌ను త్వరలో పట్టు కుని గంజాయి ఎక్కడి నుంచి తీసుకువచ్చాడు, ఎవరికి విక్రయించాడు తదితర వివరాలను విచారణలో సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకోవడంలో సమర్థ వంతంగా విధులు నిర్వహించిన రూరల్ పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌష్ఆలం, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ అభినందించారు.

# ఆదిత్య అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**రోగులకు పరీక్షలు ఉచిత మందులు అందించిన యజమాన్యం**




**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులైన ఆదిత్య, అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లి గ్రామం లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటర్ ఎలక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, జమ్మికుంట ఆదిత్య అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ జనరల్ మెడిసిన్, డాక్టర్ భరత్ న్యూరాలజిస్ట్ డాక్టర్ గ్రీష్మ గైనకాలజిస్ట్ ల చే వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకి ఉచిత షుగర్ పరీక్షలు అవసరమైన మందులు ఉచితంగా అందించడం జరిగిందని పేర్కొన్నారు. మేము అందించిన సేవలకు మాకు సహకరించిన మర్రివానిపల్లి గ్రామ సర్పంచ్ మర్రి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ కడారి పద్మ - నవీన్ వార్డు కౌన్సిలర్లు జుజాటి శ్రీవాణి, ఎడ్ల చిరంజీవి, ఎరుబాటి నాగరాజు, రౌతు రాజేష్, కోడం సంజీవ్, బైరి రవీందర్, ఏనుగు శోభారాణి ఇతర గ్రామ పెద్దలకు ఆదిత్య అమృత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాలలో ఏర్పాటుచేసి ఉచిత వైద్య సేవలతో పాటు మందులను అందిస్తామని ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ఆదిత్య అమృత ఆసుపత్రుల లక్ష్యమని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
5-9-2026

# నగరంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంట-వార్పు

**నిజామాబాద్ ప్రతినిధి (సింగిడి):** నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ శుక్రవారం నగరంలోని ధర్నా చౌక్ లో వంట-వార్పు కార్యక్రమం, సదస్సులు నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాజీ మేయర్ నీతూ కిరణ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మహిళలకు నెలకు 2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్‌కు ప్రత్యామ్నాయంగా హామీలు, కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళలకు స్కూటీలు వంటి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో




ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ అంటూ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్, సత్య ప్రకాష్, నవీద్ ఇక్బాల్, జగత్ రెడ్డి, ప్యాట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈదమ్మ మాత ఆలయ నిర్మాణానికి రూ.1.10 లక్షల విరాళం

## విగ్రహా ప్రతిష్ఠాలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**కల్వకుర్తి (సింగిడి):** చారకొండ మం డలం జేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దొడ్లపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ ఈధమ్మ తల్లి, మాంధాతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమా నికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రాస్కసి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవా రిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కోసం రూ. 1,10,000 ఒక లక్ష పది వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్కసి ఓ ఓ ఐక్యత పౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో ఆధ్యాత్మికతను, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు ఆలయాల అభివృద్ధికి




తనవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ఆర్థిక సహకారం అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి దొడ్లపల్లి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, అమ్మవారి ఆశీస్సులు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ మధు, మాజీ ఉపసర్పంచ్ మాధవ రెడ్డి, వార్డు సభ్యులు నరేష్, బాషా, సీనియర్ నాయకులు సిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణతో పాటు భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జగదీశ్వర్ రెడ్డి ఆశయసాధన కృషి చేద్దాం

## DCC అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్ నగర్ బ్యూరో (సింగిడి):** మాజీ శాసన మండలి సభ్యులు స్వర్గీయ సుంకి రెడ్డి జగదీశ్వర్ రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. జగదీశ్వర్ రెడ్డి ఆరో వర్ధంతి సందర్భంగా సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లోని వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని జగదీశ్వర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో స్వర్గీయ సుంకి రెడ్డి జగదీశ్వర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ



అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ గారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీ సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, స్వర్గీయ సుంకి రెడ్డి జగదీశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీగా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలు, ప్రజల పట్ల చూపిన అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో మేయర్ గుమ్ముల మమత శ్రీనివాస్, తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డీసీసీ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడు రోజుల్లో దాడులు ఆపాలి.. లేదంటే మిల్లులు మూసివేస్తాం!

## విజిలెన్స్ తనిఖీలపై మిల్లర్ల హెచ్చరిక.. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే టెండర్ ధాన్యంనిల్వలు
## మిల్లర్స్ కుటుంబాలపై కేసులు నమోదు చేయడం దారుణం..

**నాగర్‌కర్నూల్, (సింగిడి):** జిల్లాలో రైస్ మిల్లులపై జరుగుతున్న విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ దాడులను మూడు రోజుల్లోగా నిలిపివేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా మిల్లులు మూసివేసి నిరసనకు దిగుతామని నాగర్‌కర్నూల్ జిల్లా పారా బాయిల్డ్, రా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. రాత్రికి రాత్రే మిల్లులపై తనిఖీలు నిర్వహిస్తూ మిల్లర్లను, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ యార్డులో శుక్రవారం జిల్లా పారాబాయిల్డ్, రా రైస్ మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మిల్లర్లు మాట్లాడారు. ప్రభుత్వ ఒత్తిడితోనే ధాన్యం దింపుకున్నాంటెండర్ ధాన్యం లిఫ్టింగ్ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మిల్లర్లు ఆరోపించారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ అధికారుల ఒత్తిడితోనే మిల్లుల్లో ధాన్యాన్ని దింపుకున్నామని తెలిపారు. తమ మిల్లుల మిల్లింగ్ సామర్థ్యం కంటే రెండు నుండి మూడు రెట్లు ఎక్కువధాన్యం దింపుకో వాల్సి వచ్చిందని అన్నారు. మరాడించిన బియ్యాన్ని దింపుకునేందుకు గోదాములు అందుబాటులో లేకపోవడంతో ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. ధాన్యం నిల్వలు పెరిగిపోవడంతో ప్రస్తుతం తీవ్ర



ఇబ్బందులుఎదుర్కొంటున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. తమపై దాడులు చేయడం సరికాదన్నారు.

**వందలో ఒకరిద్దరి తప్పులకు అందరినీ దొంగలుగా చూపొద్దు**

వంద మంది మిల్లర్లలో ఒకరిద్దరు చేసిన తప్పులకు మొత్తం మిల్లర్లను దొంగలుగా చూపే ప్రయత్నం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానపరమైన ఆలస్యానికి మిల్లర్లు బలవుతున్నారని పేర్కొన్నారు. సమాజంలో మిల్లర్లు అంటేనే చులకన భావన ఏర్పడేలా పరిస్థితులు మారుతున్నాయని అన్నారు.

**కుటుంబ సభ్యులపైనా కేసులా?**

మిల్లర్ల కుటుంబ సభ్యులపై కూడా కేసులు నమోదు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రే మిల్లులపై దాడులు నిర్వహిస్తూ మిల్లర్లు, వారి కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లకు న్యాయం కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో అధికారులు ఆగ్రహానికి గురయ్యారని వారు పేర్కొన్నారు. కోర్టు తీర్పును తాము గౌరవిస్తామని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ఐదు మిల్లులపై తనిఖీలు**

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఐదు మిల్లులపై ఆర్ఆర్ కేసులు నమోదు చేసి, ఐదు రైస్ మిల్లులపై తనిఖీలు నిర్వహించినట్లు మిల్లర్లు తెలిపారు. ప్రభుత్వమే ముందుగా టెండర్ ధాన్యం లిఫ్టింగ్, నిల్వలు, బిల్లింగ్ తదితర అంశాలపై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని కోరారు. తక్షణమే విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ దాడులను నిలిపివేసి, మిల్లర్ల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల్లోగా దాడులు ఆపకపోతే జిల్లా వ్యాప్తంగా మిల్లులను మూసివేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారాబాయిల్డ్ నాగర్‌కర్నూల్ జిల్లా గౌరవ అధ్యక్షులు హకీం రాజేష్ అధ్యక్షులు ఏ. ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిలంకంటి రవికుమార్, రా రైస్ మిల్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాగర్‌కర్నూల్ అధ్యక్షుడు వేణుగోపాల్, కల్వకుర్తి అధ్యక్షుడు బాలకృష్ణ గుబ్బ ప్రవీణ్ కుమార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేనివి వెయ్యిరోజుల్లో చేసి చూపించాం

## దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్

**మహబూబ్ నగర్ బ్యూరో (సింగిడి):** కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మదనపురం, కొత్తకోట మండలాలలో భారీ సంబరాలు, బైక్ ర్యాలీలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని కార్యకర్తల్లో జ్యూస్ నింపారు. అంతేకాకుండా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మదనపురం, కొత్తకోట లలో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే జియంఆర్ పాల్గొని ప్రసంగించారు. ఉదయం మదనపురం మండలం దుప్పల్లి గ్రామంలో మొదలైన బైక్ ర్యాలీ కొత్తపల్లి మీదుగా మదనపురం మీదుగా కొత్తకోట, కానయ పల్లి, సంకిరెడ్డిపల్లి అమడబాకుల మీదుగా కొత్తకోటకు చేరుకుంది, తదనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ గత బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేని ఎన్నో పనులను మేము వెయ్యి రోజుల్లో చేసి చూపించామని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలకు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టుకుంటూ, గత



ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు _న్నామని పేర్కొన్నారు.

**దేవరకద్రలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో 3,500 ఇండ్లను మంజూరు చేశామని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతో పండుగ వాతావరణం నెలకొన్నదని, త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని తెలిపారు. మదనపురం మండలంలోనే 319 ఇందిరమ్మ ఇండ్లను, కొత్తకోట మండలంలో 514 ఇండ్లను, కొత్తకోట పట్టణంలో 146 ఇండ్లను మంజూరు చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని, దేవరకద్ర నియోజకవర్గంలో దాదాపు 48 వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అందులో మదనపురం మండలంలో 4394 కుటుంబాలకు, కొత్తకోట పట్టణం మరియు మండలంలో 9743 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. కొత్తకోట పట్టణంలో 2852 కుటుంబాలకు, మదనపురం మండలంలో 4570 కుటుంబాలకు, కొత్తకోట మండలంలో 6167 కుటుంబాలకు 500 కే సిలిండర్ ఇస్తున్నామని, కొత్తకోట మండలంలో 7896, మదనపురం మండలంలో 2399 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని తెలియజేశారు. కొత్త రేషన్ కార్డులను అందించడంతోపాటు రేషన్ కార్డు పొందిన కుటుంబాలకు దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు.

**రూ. 6 కోట్లతో బ్రిడ్జి పూర్తి**

మదనపురం నుండి ఆత్మకూరు వెళ్లే బ్రిడ్జ్ పనులను గత పాలకులు పదేళ్లు గాలికి వదిలేసారని, గతంలో సగం సగంగా నిర్మించి వదిలేసిన బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు రూ. 6 కోట్లు తీసుకొచ్చి పనులు పూర్తి చేశామని చెప్పారు. త్వరలో సంబంధిత మంత్రి గారి చేతుల మీదుగా బ్రిడ్జిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా శంకరపేట, దంతనూర్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్య ను పరిష్కరించేందుకు కోటి రూపాయల నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశామని, త్వరలోనే దానిని కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు.

**మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు**

మదనపురం మండలంలోని మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు, కనీసం లిఫ్టుల మెయింటెనెన్స్ కు అవసరమైన నిధులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మూడు లిఫ్టుల మరమ్మతులకు ఐదు కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చామని తెలిపారు. దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణాలు జరుగుతున్నాయని, గత పదేళ్ల పాలనలో వైద్య రంగాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. విద్య పరంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం దేవరకద్ర నియోజకవర్గంలో డిగ్రీ కాలేజ్, చిన్నచింతకుంట మండలంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయలేదని, మన ప్రజా ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో దేవరకద్రలో డిగ్రీ కాలేజ్, చిన్నచింతకుంట లో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన లో కొత్తకోట మదనపురం పట్టణాలలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను నెరవేర్చిందని తెలిపారు. ఇచ్చిన మాట మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా 21 వేల కోట్ల రూపాయలతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జీర్ణించుకోలేక, ఫ్రస్టేషన్కు గురవుతున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలు గత పాలనను, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకొని ఎంపీ, గ్రామ పంచాయతీ మరియు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ను చిత్తుగా ఓడించారని తెలిపారు.

# పడకల్ గ్రామ అభివృద్ధి తమ లక్ష్యం..

## సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామా న్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు. గ్రామంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలు, వీధుల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలపై ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామంలో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల సహకారంతో పడకల్ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి, స్వచ్ఛమైన, సుందరమైన, మౌలిక వసతులతో కూడిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

## మన గ్రోమోర్ కేంద్రాన్ని ప్రారంభించిన

# సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి



**కోడేరు (సింగిడి):** కోడేరు మండల కేంద్రంలో మన గ్రోమోర్ కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మన గ్రోమోర్ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి. శుక్రవారం నాడు ప్రారంభించారు

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కోడేరులో మన గ్రోమోర్ కేంద్రాన్ని ప్రారంభించుకోవడం రైతులకు శుభ పరిణామం. రైతులు నకిలీ మందులు వాడి నష్టపోకుండా మన గ్రోమోర్ సెంటర్లో దొరికే నాణ్యమైన మందులు వాడి పంట అధిక దిగుబడి పొందాలని అన్నారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు బ్రాంచ్ జోనల్ మేనేజర్ రాము మాట్లాడుతూ మన గ్రోమోర్ సెంటర్ ను ప్రారంభించి దాదాపు 20 సంవత్సరాలు అవుతుందని అప్పటినుండి ఇప్పటివరకురైతులకు నాణ్యమైన మందులు అందిస్తుందని అన్నారు మన గ్రోమోర్ సెంటర్ కు ఎలాంటి డీలర్ లేకుండా డైరెక్ట్ గా కంపెనీ నుండి మందులను సరఫరా చేస్తుందని అన్నారు రైతులకు ఏ సమస్యలు ఉన్న భూసార పరీక్షలు గాని వ్యవసాయ సలహాలు గాని అందిస్తూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని అన్నారు ప్రత్యేకమైన పోషకాలతో కూడిన ఎరువులు మరియు సేంద్రియ ఎరువులు రైతులకు అందిస్తుందని పురుగుమందులు కలుపు మందులు శిలీంద్రా నాశకలు మొక్కలు పెరుగుదల నియంత్ర కాలు జీవ ఉత్పత్తులకు పోషకాలు అందించే మందులను మన గ్రోమోర్ సెంటర్ అందిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో బ్రాంచ్ జోనల్ మేనేజర్ రామురాము ఏరియా మార్కెటింగ్ మేనేజర్ చంద్రశేఖర్ ఏరియా కంట్రోలర్ అరుణ్ ఏరియా మేనేజర్ చంద్రశేఖర్ మేనేజర్ రవి గ్రామ ఉపసర్పంచ్ మాసయ్య ఎండి బాబు చామంతి రాజశేఖర్ గౌడ్ శరత్ రామకృష్ణరైతులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**గుండాల, (సింగిడి):** మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు తదితర వేషధారణలో సందడి చేశారు. నెమలి పింఛాలు, వేణువులు, సంప్రదాయ దుస్తులతో చిన్నారులను అందంగా అలంకరించడంతో వేడుకలకు ప్రత్యేక శోభ సంతరించుకుంది. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, కృష్ణుడి లీలలను తలపించేలా చేసిన అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల వేషధారణను చూసిన తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారులతో కలిసి ఫొటోలు దిగుతూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# కొత్తగూడెం క్లబ్‌లో కృష్ణాష్టమి వేడుకలు

## భక్తిగీతాలకు మహిళల నృత్యాలు.. ఆకట్టుకున్న ఉట్టి కొట్టే కార్యక్రమం



**కొత్తగూడెం, (సింగిడి):** జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. క్లబ్ సెక్రెటరీ కోనేరు పూర్ణచంద్రరావు సతీమణి కోనేరు పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. కృష్ణాష్టమి సందర్భంగా ఆలపించిన భక్తిగీతాలకు మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకృష్ణుడికి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కోనేరు దివ్య, తాటిపల్లి రాజేశ్వరి, కంభంపాటి విజయ, పలివేల గాయత్రి, ఇంటూరి సుగుణ, చెక్క కమల, మేక రత్న, పల్లపోతు కవిత, అయిత విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నూతన పాటను ఆవిష్కరించిన మాజీ మంత్రి కేటీఆర్



**కల్వకుర్తి (సింగిడి):** హైదరాబాద్ లోని మాజీ మంత్రి కేటీఆర్ నీ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి నిర్మాతగా సింగం విజయ్ గౌడ్ రచనలో రూపొందిన నూతన పాటను కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం గోలి శ్రీనివాసరెడ్డి నీ అభినందించిన మాజీ మంత్రి కేటీఆర్ ఈ కార్యక్రమంలో, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ సర్పంచ్ కృష్ణరెడ్డి, తలకొండపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, సర్పంచ్ జల్లెల్ల కృష్ణ, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో పాల్గొన్న

# డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



**మహబూబ్ నగర్ బ్యూరో (సింగిడి):** మహబూబ్‌నగర్ లోని శ్రీ శ్రీ జగన్నాథ మందిరం, ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు శ్రీ సంజీవ్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ సంస్థాపకాచార్యులు పరమపూజ్య శ్రీ శ్రీ ఏ.సీ. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారి స్ఫూర్తితో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలలో పాల్గొని, శ్రీ జగన్నాథ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, శ్రీకృష్ణుని బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని, ప్రేమ, శాంతి, ధర్మం, మానవత్వం వంటి విలువలను సమాజంలో పెంపొందించుకోవాలని అన్నారు. శ్రీకృష్ణ జన్మా ష్టమి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ బంగ్లా రవి, కాంగ్రెస్ నాయకులు బూరెమోని చందు యాదవ్, రాకేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# నిమ్స్‌లో వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఎల్వోసీ అందజేత



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** నియోజక వర్గంలో పేదవారికి నిమ్స్ లో చికిత్స పొందేందుకు ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎల్వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన వారికి ఎల్ఓసీ ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. నగరంలోని వర్ని రోడ్ కు చెందిన సుధీర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స కోసం రూ. 5 లక్షల ఎల్వోసీ వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. అలాగే హైదరాబాద్ లోని బీబీ నగర్ ఎయిమ్స్ లో అత్యాధునిక సేవలు అందుబాటు వచ్చాయ న్నారు. పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు, అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని సూచించారు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**బోధన్ ప్రతినిధి, (సింగిడి)::** అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పిసిసి డెలిగేట్ గంగా శంకర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వెయ్యి రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం బోధన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి నినాదాలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పిసిసి డెలిగేట్ గంగా శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీటవేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకుదామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, నాయకులు పాషా, ఆదినారాయణ, సంజీవరెడ్డి, వసంత్ రెడ్డి, పోతారెడ్డి, చిరంజీవి, జహీర్, రామకృష్ణారెడ్డి, హరికాంత్ చారి, ప్రకాష్ పటేల్, రామ్మూర్తి, చిద్రపు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

## ప్రధాని మోదీ 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశం



**కరీంనగర్, (సింగిడి):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల నిర్విరామ సేవా ప్రయాణం, దేశాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి, 'వికసిత్ భారత్–2047' సంకల్పాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్'ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని శుభమంగళ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అభియాన్ జిల్లా కార్యశాల సన్నాహక సమావేశానికి సాయిని మల్లేశం అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. మోదీ రాజకీయ జీవితాన్ని, దేశసేవ పట్ల ఆయన అంకితభావాన్ని కార్యకర్తలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. దేశం, ప్రజల సంక్షేమం కోసం సేవాభావంతో నిరంతరం కృషి చేయాలని అన్నారు. అభియాన్‌లో భాగంగా పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉపమేయర్ యాదగిరి సునీల్‌రావు, సీనియర్ నాయకుడు కన్నబోయిన ఓదేలు మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్–2047' లక్ష్య సాధన కోసం ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అభియాన్ జిల్లా కన్వీనర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పోలింగ్ కేంద్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు, జిల్లా పదాధికారులు, కార్పొరేటర్లు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల, జోన్ అధ్యక్షులు, అభియాన్ కన్వీనర్లు, సహ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఘనంగా శోభాయాత్ర

## రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి. ముఖ్య అతిథిగా మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని సాయినగర్‌లో గల శ్రీ మురళీకృష్ణ మందిరంలో 'సుందర్ సత్సంగ్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులతో నిర్వహించిన శోభాయాత్ర భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల వేషధారణను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి బోధనలు ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, మానవతా విలువలకు మార్గదర్శకమని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ప్రశాంతత, సామాజిక ఐక్యతకు దోహదపడతాయని తెలిపారు. చిన్నారులను సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలకు చేరువ చేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొద్ద కృష్ణ, కార్యదర్శి ఇ. సురేందర్‌రావు, కోశాధికారి రాచర్ల వసంతం, కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రముఖులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# తీగలగుట్టపల్లి ఆర్వోబీ వద్ద తారు రోడ్డు నిర్మాణం

## బండి సంజయ్ చొరవతో రూ.28 లక్షలతో రోడ్డు పనులు వాహనదారులకు తాత్కాలిక ఊరట



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్–చొప్పదండి మార్గంలోని తీగలగుట్టపల్లి రైల్వే వంతెన వద్ద తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవతో కరీంనగర్ మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 28 లక్షల కేటాయించి రోడ్డు పనులను చేపట్టారు. దీంతో ఈ మార్గం లో రాకపోకలు సాగించే వాహనదారులకు కొంత ఉపశమనం లభించనుంది. తీగలగుట్టపల్లి రైల్వే వంతెన నిర్మాణంలో జాప్యం కారణంగా వాహనదారులు కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మాణాన్ని 2028 నాటికి పూర్తి చేయాల్సి ఉండటంతో పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, అప్పటి వరకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా రహదారి నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న బండి సంజయ్ మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉపమేయర్ యాదగిరి సునీల్‌రావుతో చర్చించి మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మించాలని సూచించారు. వంతెన నిర్మాణానికి అవసరమైన రూ. 156 కోట్లను కేంద్రం నుంచి మంజూరు చేయించడంలో బండి సంజయ్ కీలకంగా వ్యవహరించారని బీజేపీ నాయకులు తెలిపారు. భూసేకరణ తదితర అంశాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం కొనసాగుతున్న నేపథ్యంలో వాహనదారుల ఇబ్బందులకు తాత్కాలిక పరిష్కారంగా తారు రోడ్డు నిర్మించినట్లు తెలిపారు.

# కాంగ్రెస్ దగాపాలనకు నిరసనగా బిఆర్ఎస్ వంటా–వార్పు


## పాలన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**ఇల్లందు, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని, రాష్ట్ర ప్రభుత్వ పాలన తీరు రేవంత్ రెడ్డి పనితీరును టిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకొని రాష్ట్ర ప్రజానీకాన్ని దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విఫల పాలనను నిరసిస్తూ ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సమ రభేరి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంద ర్భంగా శుక్రవారం ఇల్లందులోని జగదాంబ సెంటర్ ఇల్లందు పట్టణ, మండల పార్టీ శ్రేణు లు మహిళా కార్యకర్తలతో కలిసి వంటా–వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,. మాజీ ఎమ్మెల్యే నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్ బానోత్. హరి ప్రియ కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల విఫల పాలనపై మాట్లాడుతూ,ఎన్నికలకు ముందు హా మీద వర్షం కురిపించి అధికారంలోకి వచ్చాక మాటల మాయాజాలంతో ప్రభుత్వాన్ని నడుపుతూ మహిళలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. మహిళల ఓట్లతో అధికారాన్ని దక్కించుకొని అదే మహిళల సంక్షేమాన్ని విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమా అని ప్రశ్నించారు. ప్రతి మహిళకు ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మంది మహిళలకు నెలకు ?2,500 ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఇప్పుడు తులం బంగారంతో పాటు పూర్తిగా కల్యాణ లక్ష్మి పథకాన్ని కూడా ఎగవేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పావులు కదుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. .వృద్ధులకు వితంతువు లకు దివ్యాంగులకు పెంచుతామన్న పెన్షన్ల మొత్తం ఏమైంది అని ప్రశ్నించారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని కాంగ్రెస్ దగా పాలనకు వ్యతిరేకంగా మొదలైన ఈ ప్రజా ఉద్యమం చల్లారదని 420 హామీల అమలు కోసం టిఆర్ఎస్ పోరాటం ఆగదు అని హెచ్చరిం చారు. ప్రజల కోసం ప్రశ్నించే గొంతుకగా మహిళల కోసం పోరాడే పార్టీగా టిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు ముందంజలో ఉంటుందని హెచ్చరిస్తూ మహిళలకు ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి, తిరిగి మహిళలే రాబోయే కాలంలో కచ్చితంగా సరైన గుణపాఠం తప్పదు అన్నారు. కార్యక్రమంలో రాజేందర్, సత్యనారా యణ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్,లకావత్ దేవిలాల్ నాయక్, రంగనాథ్, శీలం రమేష్, మాజీ కౌన్సిలర్లు జెకె శీను, కటకం పద్మావతి, తోట లలిత శారద, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అండర్–13, 15 సబ్‌జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు

## అంతర్‌జిల్లా పోటీలకు 64 మంది క్రీడాకారుల ఎంపిక



**చుంచుపల్లి, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన అండర్––13, 15 సబ్‌జూనియర్స్ సాఫ్ట్‌బాల్ అంతర్‌జిల్లా పోటీలకు క్రీడాకారుల ఎంపికలను శుక్రవారం కొత్తగూడెంలో నిర్వహించారు. శ్రీ రామాంజనేయ నగర్‌లోని సెయింట్ జేవియర్ హైస్కూల్‌లో ఉదయం నిర్వహించిన ఎంపిక పోటీలకు సుమారు 120 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభను ప్రదర్శించారు. ఎంపికలను మాజీ ఎంఈఓ బాలాజీ, సెయింట్ జేవియర్ హైస్కూల్ ప్రిన్సిపల్ బాలస్వామి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సత్తుపల్లి, వీఎం బంజర, భద్రాచలం, టేకులపల్లి, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. నాలుగు విభాగాల్లో బాలికలు 32 మంది, బాలురు 32 మందిని కలిపి మొత్తం 64 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు బెల్లంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. మధుకర్, ప్రధాన కార్యదర్శి కె. నవీన్‌కుమార్, కోశాధికారి వి.వి.జి. కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా కోచ్ పొన్నాల పృధ్వీరాజ్ ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీసీతారామ ఆలయ నిర్మాణానికి మంత్రి అడ్లూరి భూమిపూజ





**జగిత్యాల ప్రతినిధి, (సింగిడి):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాంభద్రునిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆలయాలు మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. దేవాలయ నిర్మాణానికి తన వంతుగా అవసరమైన సహాయాన్ని అందిస్తానని మంత్రి తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములైతే "ఇది మన గుడి" అనే భావన ప్రతి ఒక్కరిలో కలుగుతుందని అన్నారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్న గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపేటలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో...**

ఎండపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నూతన ఇంటిలో అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థి, యువత సదస్సు ఏర్పాట్ల పరిశీలన

## నేడు కరీంనగర్‌కు కెటీఆర్ రాక

## అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన గంగుల కమలాకర్, కొండూరు రవీందర్‌రావు



**కరీంనగర్, (సింగిడి):** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వ ర్యంలో కరీంనగర్ నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో రేపు నిర్వహించనున్న విద్యార్థులు, యువత సదస్సుకు పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండూరు రవీందర్‌రావుతో కలిసి శుక్రవారం సదస్సు ప్రాంగణాన్ని పరిశీలించారు. సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు, వేదిక, ఇతర సౌకర్యాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జీవి రామకృష్ణ రావు, నగర అధ్యక్షులు చల్ల హరి శంకర్, ఏనుగు రవీందర్ రెడ్డి, పొన్నం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజాపాలన 1000 రోజుల సంబరాలు

## నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ద్విచక్ర వాహన ర్యాలీ



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లో కాంగ్రెస్ ప్రజాపాలన 1000 రోజుల సంబరాల్లో భాగంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలిరావడంతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఊట్కూరి నరేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**ఖమ్మం, (సింగిడి):** ఖమ్మం నగరంలో వివిధ వాడల్లో కృష్ణాష్టమి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహిఽచారు. శుక్రవారం నగర పరిధిలోని టేకులపల్లి, బల్లేపల్లి, గొల్లగూడెం, తదితర ప్రాంతంలో నిర్వహించిన వేడుకల్లో ఉట్టి పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు చేత శ్రీకృష్ణుడు, గోపికలు వలె వేషధారణలు ధరించి ముత్యాలు చేశారు. ఈ వేడుకల్లో ఆయా ప్రాంత నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు వెంకట చల్మరెడ్డి



**కల్వకుర్తి, (సింగిడి):** కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన కళ్యాణం శంకరమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రిటైడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకట చల్మరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ కుటుంబానికి 5,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , నిజాముద్దీన్ , జీడిగ రాంరెడ్డి, వార్డు సభ్యులు సందడి పర్వత్ రెడ్డి,సికిందర్, మాజీ వార్డు సభ్యులు ఆదిరాల వెంకటయ్య,దున్న భాస్కర్, బాలకృష్ణ గౌడ్, నాయకులు వజ్ర లింగం, పోలే రవి, గొల్ల పెంటయ్య,మార్గాల రవి, కళ్యాణం రత్నం,ఫక్రుద్దీన్, మేకల స్వామి, మోటపురం యశ్వంత్,శంభు లింగం,రెమో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారు

## కరీంనగర్‌లో బీఆర్ఎస్ 'వంటా వార్పు' నిరసన మాజీ మంత్రి గంగుల కమలాకర్



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో 'వంటా వార్పు' నిరసన కార్యక్రమం నిర్వ హిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి 1000 రోజులు పూర్త యిన సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎండగడుతూ చేపట్టిన ఈ కార్యక్ర మంలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కళ్యాణలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మహిళలను మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2,500, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇస్తామన్న హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. హామీల అమలు కోసం మహిళల పక్షాన పోరాటం కొనసాగిస్తామని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో 1000 రోజులు పూర్తయినా హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని విమర్శించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, కొండా సురేఖ రూపంలో తొలి వికెట్ పడిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి స్పందన వస్తోందని, రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ఆదర్శనీయం

## సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్' జిల్లా కార్యశాల శుక్రవారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ, అంకితభావాన్ని పురస్కరించుకుని బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యశాలలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉపమేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల ్రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్లుగా మోదీ అందిస్తున్న పాలనలో ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకపోవడం ఆయన పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. మోదీ నాయకత్వాన్ని గుర్తించి 35కుపైగా దేశాలు తమ అత్యున్నత పురస్కారాలతో సత్కరించాయని తెలిపారు. దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ఆయన తీసుకుంటున్న నిర్ణయాలను అంతర్జాతీయ సమాజం ప్రశంసిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు, లబ్ధిదారులకు వివరించాలని నాయకులకు సూచించారు. నెలరోజుల పాటు నిర్వహించే సేవా కార్యక్రమాల్లో ప్రజలు, బీజేపీ కార్యకర్తలను పెద్దఎత్తున భాగస్వాములను చేసి 'సేవా సంకల్ప్ అభియాన్'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, కార్యక్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్, సంతోషిమాత ఆలయంలో

# వెలిచాల రాజేందర్‌రావు ప్రత్యేక పూజలు

## ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తానని హామీ



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని జ్యోతినగర్‌లో గల హనుమాన్––సంతోషి మాత ఆలయాన్ని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చ కులు తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ కమిటీ ప్రతినిధులు రాజేందర్‌రావును సన్మానించారు. అనంతరం సంతోషిమాత ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆలయ పునర్నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తూ అవసరమైన కృషి చేస్తానని రాజేందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, మాజీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు ధర్మారం వెంకటస్వామి, మాజీ కార్పొరేటర్ వాల రమణారావు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## శ్రీకృష్ణుడు, రాధల వేషధారణలో విద్యార్థుల సందడి.. సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు



**ఖమ్మం, (సింగిడి):** ఖమ్మంలోని న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ఆకట్టుకోగా.. చిన్నారుల నృత్యాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం కృష్ణమయంగా మారింది. వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. ఆబాద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అందించిన సందేశం, జీవితంలో ధర్మాన్ని పాటించడం, కర్తవ్యాన్ని నిర్వర్తించడం నేటి విద్యార్థులకు ఎంతో మార్గ దర్శకమన్నారు. పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలి పారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వేదికపై చేసిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలను ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్లు సీహెచ్. కార్తీక్, సీహెచ్. స్ఫూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

singidinews@gmail.com



## కృష్ణాష్టమి స్పెషల్..

### వివాదానికి ఫుల్‌స్టాప్ పెడుతూ

# అనసూయ డ్యాన్స్!

శ్రీకృష్ణాజన్మాష్టమి సందర్భంగా యాంకర్, నటి అనసూయ ఓ ప్రత్యేక వీడియో పంచుకున్నారు. ఇన్‌స్టాలో వైరల్ అయిన 'తులసి కోమలవేణి..' అనే కన్నడ భక్తి గీతానికి నృత్యం చేసిన వీడియోను షేర్ చేశారు. చివర్లో 'కృష్ణుడికి అంతా తెలుసు. నాకు అది చాలు' అనే క్యాప్షన్‌ను జోడించారు. దీంతో సనాతన ధర్మం విషయంలో ఇటీవల తనపై వచ్చిన విమర్శలకు ఆమె ఈ వీడియోతో ఫుల్‌స్టాప్ పెట్టినట్లు తెలుస్తోంది

## ఈ సినిమాలో భాగం కావడం
# సంతోషంగా ఉంది.. బ్రహ్మాజీ



జయశ్రీ మీడియా సమర్పణలో కలాల్ శ్రీనివాస్ నిర్మాతగా నాగరాజు కొట్టే దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కృష్ణంభజే'. భక్తి ఆధ్యాత్మిక భావాలతో రూపొందుతోన్న ఈ మూవీ నుంచి తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఇందులో సీనియర్ నటుడు బ్రహ్మాజీ కీలక పాత్రలో నటిస్తుండగా.. శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ లుక్‌ను బ్రహ్మాజీ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా పంచుకుంటూ.. 'శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా అందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు.. కృష్ణంభజే చిత్రంలో భాగం కావడంతో పాటు.. నా హృదయానికి ఎంతో దగ్గరైన 'మార్కేండేయ' అనే ప్రత్యేక పాత్రను పోషించడం చాలా సంతోషంగా, ఉత్సాహంగా ఉంది. దర్శకులు నాగరాజు కొట్టే మరియు చిత్ర బృందం మొత్తంతో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభవం. ఇందులో నాకు ఈ చక్కని అవకాశం ఇంచినందుకు ధన్యవాదాలు. మీ ప్రేమ మరియు మద్దతు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.. జై శ్రీ కృష్ణ!' అని తెలిపాడు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ సినీ వర్గాల్లో, ప్రేక్షకులలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# మిస్ అయ్యేది లేదు..

### సంగీత్ శోభన్ మూవీ టైటిల్ గ్లింప్స్ విడుదల తేదీ ప్రకటించిన మేకర్స్



'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్', 'రాకాస' వంటి సినిమాలతో ఫుల్ పాపులారిటీ తెచ్చుకున్న టాలీవుడ్ యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. వరుస ఆఫర్లతో దూసుకుపోతున్న ఈ యంగ్ సెన్సేషన్, 'కుమారి 21ఎఫ్' ఫేమ్ పల్నాటి సూర్యప్రతాప్ దర్శకత్వంలో ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేయడానికి రెడీ అయ్యారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ సరసన మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్, విజిబి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నిర్మాతలు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'ప్రొడక్షన్ 3' అనే వర్కింగ్ టైటిల్‌తో సెట్స్ పైకి వెళ్లిన ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ ఇప్పటివరకు పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది.

తాజాగా, మేకర్స్ కొత్త విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చేశారు. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను సెప్టెంబర్ 6న అఫీషియల్‌గా లాంచ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంగీత్ శోభన్, అనస్వర రాజన్ కలిసి ఉన్న ఒక కలర్‌ఫుల్ అండ్ క్యూట్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. వాళ్ల ప్రపంచాన్ని చాలా సరదాగా, ఉత్సాహంగా చూసేందుకు అందరూ రెడీ అయిపోండి.. ఈసారి డేట్ మిస్ అయ్యేదే లేదు అంటూ క్యాప్షన్ జత చేసి మేకర్స్ క్యూరియాసిటీని పెంచేశారు. ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్న ఈ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. పల్నాటి సూర్యప్రతాప్ మార్క్ యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎలిమెంట్స్‌కి తోడు సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్ తోడైతే బాక్సాఫీస్ దగ్గర మళ్లీ 'మ్యాడ్' రేంజ్ మ్యాజిక్ రిపీట్ అవ్వడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

సినిమా సింగిడి Cinma Singidi

శనివారం 5-9-2026

# కొణిదెల వారి ఇంట్లో చిన్నికృష్ణుడు సందడి

మెగా హీరో రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. తమ కనిపిస్తున్నారు. తమ కవల పిల్లలను ఒళ్లో కూర్చొని పెట్టుకుని పూజా కార్యక్రమంలో పాల్గొంటుండగా, వారి పెద్ద కుమార్తె క్లిన్ కార తన



కుమారుడు, కూతుర్లను శ్రీకృష్ణుడు, రాధారాణి వేషధారణలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను మెగా కోడలు ఉపాసన సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. "కల నెరవేరింది. నిజంగా ధన్యమైనది. ఓం నమో భగవతే వాసుదేవాయ. అందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు" అని ఉపాసన ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. ఇందులో చెర్రీ – ఉపాసన దంపతులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి, తమ పూజా మందిరంలో విగ్రహాల ముందు కూర్చుని పూజ చేస్తూ

తల్లిదండ్రులు మధ్య కూర్చుని ఉంది. ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగు పెట్టాడు' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఉపాసన షేర్ చేసిన ఫొటోలో తమ ముగ్గురు చిన్నారుల ఫేస్ కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. అయినప్పటికీ 'కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగు పెట్టాడు' అంటూ మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెగా కపుల్ కి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు చెబుతూ కామెంట్లు చేస్తున్నారు. మెగా ఫ్యామిలీ కృష్ణాష్టమి స్పెషల్ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రామ్ చరణ్ – ఉపాసన దంపతులు 2023 జూన్ 20న క్లీంకారకు

జన్మనిచ్చారు. ఈ ఏడాది జనవరి 31న వీరికి కవలలు జన్మించారు. బాబుకి శివరామ్, పాపకి అన్వీరా దేవి అని పేర్లు పెట్టారు. ట్విన్స్ రాకతో మెగా ఫ్యామిలీలో ఆనందాలు వెల్లువెత్తాయి. కొణిదెల ఫ్యామిలీలోకి మూడో తరం వారసుడు వచ్చాడని మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, రామ్ చరణ్ ఇటీవల బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'లో కనిపించారు. ఈ పాన్ ఇండియా సినిమా బాక్సాఫీస్ దగ్గర రూ. 400 కోట్ల గ్రాస్ రాబట్టినట్లు మేకర్స్ ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలో చెర్రీ ఓ సినిమాని ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లలో భారీ బడ్జెట్ తో ఈ చిత్రం తెరకెక్కనుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. చరణ్ ఈ మధ్యనే సర్జరీ చేయించుకోవడంతో, ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాత సినిమాని సెట్స్ మీదకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు.



### టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్న

# 'ప్రేమలు' బ్యూటీ..
## సూపర్ స్టార్‌కు జోడీగా చాన్స్!

'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారి అన్ని ఇండస్ట్రీల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది యంగ్ బ్యూటీ మమితా బైజు. ఈ మలయాళ ముద్దుగుమ్మ తన క్యూట్ లుక్స్, యాక్టింగ్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టింది. ఆ తర్వాత తమిళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకోవడమే కాకుండా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటూ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతోంది. ఇటీవల ఈ అమ్మడు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెహెం కుటుంబ యూనిట్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించి సరికొత్త రికార్డులు సృష్టించాయి. ఇలా వరుస విజయాలతో తమిళంలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న మమిత, తెలుగు సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.

అదీ కూడా తన మొదటి తెలుగు సినిమాలోనే ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుందనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు.. తన తదుపరి అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో మమితను హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్లు టాక్. ఒకవేళ ఇదే నిజమైతే మమితా బైజు కెరీర్‌కి తెలుగులో ఇది ఊహించని బిగ్ ఆఫర్ అని చెప్పవచ్చు. సూపర్ స్టార్ పక్కన నటిస్తే టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా స్థిరపడటం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ క్రేజీ కాంబినేషన్ న్యూస్ విన్న మహేష్ ఫ్యాన్స్, మూవీ లవర్స్ మాత్రం ఎగ్జైట్‌మెంట్‌తో ఈ కాంబో ఓకే అయితే బాగుండు అని కోరుకుంటున్నారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737